

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : సాయంత్రం 6:33 (బుధవారం)
సహరీ : ఉదయం 5:05 (గురువారం)

ఏమి హాయిలే ఇలా..!

- అందుబాటులోకి కొత్త రకం దోమతెరలు
- ఆరుబయట, నేలపై పడుకునే వారికి ఉపయోగం
- జీజీహెచ్‌లో రోగుల బంధువులకు ఇవే ఆశ్రయం



గైనిక్ వార్డు ఎదుట దోమతెరల్లో నిద్రిస్తున్న సహాయకులు

కర్నూలు(హాస్పిటల్), మార్చి 12: దోమలంటే బెంబేలెత్తిపోయే జనం ఇప్పుడు అలాంటి భయమే అవసరం లేదంటున్నారు. కొత్తగా మార్కెట్లోకి వచ్చిన దోమ తెరలు ఉంటే చాలు ఆరుబయట హాయిగా నిద్రించవచ్చని సెలవిస్తున్నారు. స్వచ్ఛమైన గాలితోపాటు దోమల బెడద నుంచి రక్షణ ఉంటుందని చెబుతున్నారు. వినూత్నమైన దోమతెరలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. ముఖ్యంగా వీటిని పెద్దాసుపత్రి వద్ద ఉన్న ఫుట్‌పాత్‌పై ఎక్కువగా విక్రయిస్తున్నారు. దీంతో ఆసుపత్రికి వచ్చే రోగులంతా వీటిని ఎక్కువగా వినియోగిస్తున్నారు. ఆసుపత్రిలో 1500 మంది అడ్మిషన్ అయి చికిత్స పొందుతుంటారు. రోగికి సహాయకులుగా ఇద్దరు నుంచి ముగ్గురు ఉంటారు. ఇలా వచ్చిన వారంతా ఈ కొత్త రకమైన దోమతెరలను ఉపయోగించి రాత్రిళ్లు వాటి కింద నిద్ర పోతున్నారు. దోమల బెడద లేకుండా ప్రశాంతంగా నిద్ర పట్టేలా చేస్తున్నాయి. ఒక్కో దోమతెర రూ.700 నుంచి రూ.1000 పలుకుతోంది. ఆసుపత్రిలోని మెడిసిన్, సూపర్‌స్పెషాలిటీ, గైనిక్, చిన్నపిల్లల విభాగాల వద్ద దాదాపు వంద దోమతెరలను రోగుల బంధువులు ఉపయోగిస్తున్నారు.

రూ.1000 పెట్టి కొనుగోలు చేశా



దోమలు అధికంగా ఉండటంతో ఐదు రోజుల క్రితం రూ.1000 పెట్టి దోమతెరను కొనుగోలు చేశా. గతంలో నా భార్య కీర్తి మొదటి కాన్పు కోసం రెండేళ్ల క్రితం ఇదే ఆసుపత్రికి వచ్చా. అప్పుడు దోమలు లేవు. ఇప్పుడు ఇక్కడ దోమలు ఎక్కువగా ఉన్నాయి. నా ఆటోపైనే దోమతెరను కట్టి ఇక్కడే నేను, మా అబ్బాయి రాత్రి పూట నిద్రిస్తున్నాం.

- సురేష్, గర్భిణి భర్త, డోన్



ఆటోపైనే దోమతెరను ఏర్పాటు చేసిన డోన్‌కు చెందిన సురేష్



గైనిక్ వార్డు దగ్గర దోమ తెరలో కుమారుడు, తండ్రి

ప్లంజ్ పూల్‌తో ముప్పు



- ఆ గుంతను పూడ్చేయడానికి తక్షణ చర్యలు తీసుకోవాలి
- అప్రోచ్ రోడ్డు, రిటైనింగ్ వాల్‌ను తక్షణమే పునర్నిర్మించాలి
- శ్రీశైలం డ్యాం భద్రత పనులు చేపట్టాలి
- డ్రిప్-2 కింద రూ.190 కోట్లు ఇవ్వాలి
- నివేదిక సిద్ధం చేసిన నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ బృందం
- రెండు రోజుల్లో కేంద్రానికి పంపించే అవకాశం

కర్నూలు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ప్రాజెక్టుకు ప్లంజ్ పూల్ వల్ల ముప్పు ఉంది. ఆ గుంతను పూడ్చేందుకు ప్రత్యేక నిపుణుల అధ్యయనానికి తక్షణ చర్యలు తీసుకోవాలని, 2009 వరదలకు కొట్టుకుపోయిన అప్రోచ్ రోడ్డు, రిటైనింగ్ వాల్, సిలిండర్ రిపేరి.. వంటి పనులు సహా డ్యాం భద్రతా చర్యలు, మరమ్మతుల కోసం డ్రిప్-2 కింద ప్రతిపాదించిన పనులు తక్షణం చేపట్టాలని నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) బృందం నివేదిక సిద్ధం చేసింది. రెండు మూడు రోజుల్లో కేంద్ర, రాష్ట్ర జలవనరుల శాఖకు ఆ నివేదిక అందించనున్నారు. డ్రిప్-2 కింద రూ.190 కోట్లు నిధులు ఇవ్వాల్సిన అవసరం ఉందని ఆ నివేదికలో వివరించినట్లు సమాచారం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాశ్వత మరమ్మతులు చేపడుతారా..? ఇప్పటి వరకు నిపుణులు ఇచ్చిన నివేదికల్లాగే పక్కన పెడుతారా..? అని నాయకులను రైతులు ప్రశ్నిస్తున్నారు.

రూ.190 కోట్లకు చేరిన అంచనా

శ్రీశైలం ప్రాజెక్టు ఆనకట్ట స్పిల్‌వే గేట్ల నుంచి అతివేగంగా కింద పడే వరద నీరు మళ్లీ ఎగిరి పడే ప్రాంతం (ప్లంజ్‌పూల్)లో భారీ గుంత ఏర్పడింది. ఈ గుంత లోతు 45 మీటర్లు, వెడల్పు 270 మీటర్లు, పొడవు 400 మీటర్లు ఉంటుందని అంచనా వేశారు. డ్యాం డౌన్ స్ట్రీమ్‌లో ఆప్రాన్‌కు వెళ్లాలంటే అప్రోచ్ రోడ్డు ఎంతో ముఖ్యం.. ఈ రోడ్డు 3-4 కిలోమీటర్లు ఉంటుంది. 2009 వరదలకు ఈ అప్రోచ్ రోడ్డు కొట్టుకు పోయింది. రిటైనింగ్ వాల్ 2.50 కిలోమీటర్లు ఉంటే.. వరదలకు 600 మీటర్లు పూర్తిగా కొట్టుకుపోయింది. డ్యాం శాశ్వత మరమ్మతుల చేపట్టాలంటే అప్రోచ్ రోడ్డు, రిటైనింగ్ వాల్ నిర్మాణం అత్యవసరం అని నిపుణుల కమిటీ సూచించింది. అలాగే.. ప్రమాకరంగా మారిన ప్లంజ్‌పూల్ గుంత పూడ్చివేతకు ఎలాంటి ఆధునిక పద్ధతులు చేపట్టాలో ఆధ్యయనం కోసం లక్నో, పూణే, బెంగళూరు వంటి నగరాలకు చెందిన ఏడు ప్రముఖ కన్సల్టెన్సీ సంస్థలను గుర్తించారు.. అందులో ఓ సంస్థను ఎంపిక చేసి తక్షణమే అధ్యయనం చేపట్టాలని, నిర్లక్ష్యం వద్దని సూచించినట్లు తెలిసింది. ఆయా పనుల కోసం డ్రిప్-2 కింద గతంలో రూ.135 కోట్లతో ప్రతిపాదనలు పంపితే.. తాజాగా రూ.190 కోట్లకు చేరింది. ఆ నిధులు కూడా తక్షణమే విడుదల చేయాల్సిన అవసరం ఉందని ఎన్‌డీఎస్‌ఏ నిపుణుల కమిటీ అభిప్రాయపడినట్లు తెలిసింది.



శ్రీశైలం డ్యాంను పరిశీలిస్తున్న ఎన్‌డీఎస్‌ఏ చైర్మన్ వివేక్ త్రిపాఠి బృందం (ఫైల్)

రెండు మూడు రోజుల్లో ఎన్‌డీఎస్‌ఏ నివేదిక



శ్రీశైలం ప్రాజెక్టు భద్రత, నిర్వహణపై నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) చైర్మన్ వివేక్ త్రిపాఠి బృందం ఫిబ్రవరి 8న పరిశీలించింది. భద్రతకు తీసుకుంటున్న చర్యలు, చేపట్టాల్సిన పనులు, ప్లంజ్‌పూల్ మరమ్మతులు వంటి సమగ్ర వివరాలతో నివేదిక తయరు చేశారు. రెండు మూడు రోజుల్లో ప్రభుత్వానికి అందించే అవకాశం ఉంది. మూడు రోజుల క్రితమే ఆ కమిటీ సభ్యులతో మాట్లాడాను. డ్రిప్-2 కింద పంపిన ప్రతిపాదనల అంచనా రూ.135 కోట్ల నుంచి రూ.190 కోట్లకు చేరింది.

- కబీర్‌బాషా, ఇరిగేషన్ ప్రాజెక్ట్స్ సీఈ, కర్నూలు

తెలుగు రాష్ట్రాల జీవనాడి శ్రీశైలం జలాశయం. రాయలసీమ పల్లెల కరువు నేలను తడిపే ఆధునిక దేవాలయం. 2009 భారీ వరదలకు డ్యాం దెబ్బతిని భద్రత సమస్యలు తలెత్తాయి. ప్రాజెక్టు భద్రత, శాశ్వత మరమ్మతుల కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన పలు నిపుణుల కమిటీలు అధ్యయనం చేశాయి. భద్రతపై తీసుకోవాల్సిన చర్యలతో పలు నివేదికలు ఇచ్చారు. నిపుణులు వస్తున్నారు.. పరిశీలిస్తున్నారు.. నివేదికలు ఇస్తున్నారు. పాలకులు మాత్రం స్పందించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. శ్రీశైలం ప్రాజెక్టు గరిష్ఠ నీటి మట్టం 885 అడుగులు. గరిష్ఠ నీటినిల్వ సామర్థ్యం 308.04 టీఎంసీలు కాగా.. ఏటేటా పూడిక చేరడం వల్ల 215.80 టీఎంసీలకు పడిపోవడంతో 92.24 టీఎంసీలు కోల్పోవాల్సి వచ్చింది. 2009 అక్టోబరులో 25.5 లక్షల క్యూసెక్కుల వరద చేరడంతో వరద ఒత్తిడికి ప్లంజ్‌పూల్ గంత ఏర్పడింది. అప్రోచ్ రోడ్డు, రిటైనింగ్ వాల్ కొట్టుకుపోయాయి. డ్యాం భద్రత, నిర్వహణ, చేపట్టాల్సిన శాశ్వత మరమ్మతులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నియమించిన పలు నిపుణుల కమిటీలు పరిశీలించి పలు సూచనలు చేస్తూ నివేదికలు ఇచ్చాయి. తాజాగా ఈ ఏడాది ఫిబ్రవరి 8న నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) చైర్మన్ వివేక్ త్రిపాఠి ఆధ్వర్యంలో నిపుణుల బృందం పరిశీలించింది. డ్యాం భద్రత, నిర్వహణ కోసం తీసుకోవాల్సిన తక్షణ చర్యలు సమగ్ర నివేదిక రెండు మూడు రోజుల్లో కేంద్ర జలవనరుల శాఖ, రాష్ట్ర ప్రభుత్వానికి అందజేయనున్నట్లు తెలిసింది. ఇప్పటికే ప్రభుత్వాలకు చేరిన నివేదికల్లాగే.. ఎన్‌డీఎస్‌ఏ కమిటీ ఇచ్చే నివేదిక కూడా పెండింగ్ ఫైల్ కిందకు చేరుతుందా..? అని రాయలసీమ సాగునీటి నిపుణులు ప్రశ్నిస్తున్నారు.



భక్తులకు మెరుగైన సేవలందిస్తాం

- రూ.25 కోట్లతో 12 అంతస్థుల భవనాలను నిర్మిస్తాం
- మంత్రాలయం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు



మాట్లాడుతున్న పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

మంత్రాలయం, మార్చి 12: మంత్రాలయం శ్రీరాఘవేంద్రస్వామి దర్శనార్థం వచ్చే భక్తులకు మరింత మెరుగైన సేవలందించేందుకు బృహత్తర ప్రణాళిక రూపొందించినట్లు మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు అన్నారు. గురు వైభోత్సవాల్లో భాగంగా మంగళవారం భక్తులనుద్దేశించి పీఠాధిపతి మాట్లాడారు. మంత్రాలయం రాఘవేంద్ర సర్కిల్‌లోని ఆర్‌అండ్‌బీ నుంచి శ్రీమఠం వారు ఇటీవలే స్వాధీనం చేసుకున్న స్థలంలో తాను పీఠానికి వచ్చి 12 ఏళ్లు కావడంతో రూ.25 కోట్లతో 12 అంతస్థుల భవన నిర్మాణానికి శ్రీకారం చుడతామన్నారు. ఈ నెల 16న రాఘవేంద్రస్వామి 429వ పుట్టిన రోజున భూమి పూజ చేస్తున్నట్లు వెల్లడించారు. ఇందుకు సంబంధించిన ప్రణాళిక, బ్లూప్రింట్ సిద్ధంగా ఉందన్నారు. పరిమళ ప్రసాద కౌంటర్లు, లాకర్లు, 400 గదులు, సేవా కౌంటర్లు, తాగునీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు అందులో కల్పిస్తామన్నారు. అభయ శ్రీరామ ఏకశిల విగ్రహ సమీపంలో వందెకరాల్లో తుంగభద్ర నది నుంచి పంపింగ్ చేసి ఎస్ఎస్ ట్యాంకును నిర్మించి మంత్రాలయం పట్టణంతో పాటు వివిధ గ్రామాలకు తాగునీరు అందించేందుకు త్వరలో ప్రణాళిక రూపొందిస్తామన్నారు. మంత్రాలయం పరిసర ప్రాంతాల్లో మినీ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అనువైన స్థలాన్ని ఇప్పటికే గుర్తించామన్నారు. రాఘవేంద్రస్వామి ఆశీస్సులతో దేశం సుభిక్షంగా సకాలంలో వర్షాలు కురిసి రైతులు పాడి పంటలతో సస్యశ్యామలంగా ఉండాలని రాఘవేంద్రస్వామిని ప్రార్థిస్తున్నట్లు పీఠాధిపతి తెలిపారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన పౌరసత్వ చట్టాన్ని ఆయన సమర్థించారు. ఈ సమావేశంలో విద్వాన్ రాజా ఎస్.గిరిరాజాచార్, ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు, ఈఈ సురేష్ కోనాపూర్, ఏఈ బద్రినాథ్, బీఎం ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల వేళ వైసీపీ 'రాజకీయం'

- కర్నూలు మేయర్‌గా సత్యనారాయణమ్మ
- రామయ్య రాజీనామా చేయకనే ఎంపిక చేసిన అధిష్ఠానం
- ఎన్నికల్లో ఓట్ల కోసమే పదవుల పందేరం

కర్నూలు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ అధికార వైసీపీ ఓట్ల రాజకీయాలకు పాల్పడుతోంది. ఈ క్రమంలో అనూహ్య పరిణామాల నేపథ్యంలో కర్నూలు నగరపాలక సంస్థకు మేయర్ మార్పు చేయాలని భావించింది. అనుకున్నదే తడవుగా కర్నూలు నగర పాలక సంస్థలో 25వ వార్డు కార్పొరేటర్ సత్యనారాయణమ్మను మేయర్‌గా ఎంపిక చేస్తూ వైసీపీ అధిష్ఠానం మంగళవారం రాత్రి అధికారికంగా వెల్లడించింది. ప్రస్తుతం మేయర్‌గా బీవై రామయ్య కొనసాగుతున్నారు. అయితే ఆయన్ను కర్నూలు ఎంపీ అభ్యర్థిగా ఎంపిక చేశారు. దీంతో రామయ్య స్థానంలో మేయర్‌గా సత్యనారాయణమ్మను ప్రకటించారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. మేయర్ రామయ్య రాజీనామా చేయకుండానే మరో మేయర్ అభ్యర్థిని ఎంపిక చేయడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. రాబోయే ఎన్నికల్లో ఓట్ల కోసం పదవుల పందేరంలో భాగంగా ఈ ఎంపిక జరిగినట్లు తెలుస్తోంది. నిబంధనల ప్రకారం ప్రస్తుత మేయర్ రామయ్య రాజీనామా లేఖను మున్సిపల్ శాఖ డీఎంఏకు పంపాలి. ఆయన ఆమోదం తెలిపిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ఖాళీలను భర్తీ చేసేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘానికి నివేదిక పంపాలి. రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసి మేయర్‌గా ఎంపిక చేయాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ మొత్తం చాలా సమయం పడుతుంది. అలాకాకుండా ఐదారు రోజుల్లో సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే ముందు హడావుడిగా మేయర్ అభ్యర్థిని ప్రకటించడం రాబోయే ఎన్నికల్లో రాజకీయ లబ్ధి కోసమేనని చర్చ జరుగుతోంది.

రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభం

కర్నూలు (కల్చరల్), మార్చి 12: నెలవంక దర్శనంతో ఉమ్మడి జిల్లాలోని ముస్లింలు మంగళవారం రంజాన్ నెల రోజా (ఉపవాసం) దీక్షలు ఆరంభించారు. తొలిరోజున వేకువ జామున సహరి నుంచి దీక్షలు ప్రారంభించి సాయంత్రం ఇఫ్తార్ వేళ వరకు ఉపవాసం పాటించారు. అనంతరం ప్రత్యేక నమాజులు ఆచరించారు. ఖురాన్ గ్రంథ పఠనం చేశారు. రంజాన్ మాసం ఆరంభం సందర్భంగా ఉమ్మడి జిల్లాల్లోని మసీదులకు పండుగ కళ కనిపించింది. నిత్యం ఐదు పూటల నమాజులతోపాటు తరావీహ్ నమాజ్‌లను మత పెద్దలు చేయించారు. ఆయా మసీదుల్లో మతపెద్దలు రంజాన్ ప్రాముఖ్యతను వివరించారు. ఈ మాసంలో ప్రతి ఒక్కరూ తమ జీవన శైలిని ఎలా మల్చుకోవాలో తెలియజేశారు. మరోవైపు ఎండలు తీక్షణంగా ఉన్న కారణంగా ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని వారు సూచించారు.

తొలిరోజు కిక్కిరిసిన మసీదులు

రంజాన్ మాసం ఆరంభం కావడంతో ముస్లిం జనాభా ఎక్కువగా ఉన్న కర్నూలు పాత నగరంలోని వివిధ ప్రాంతాల్లో రంజాన్ మాసం ఆరంభ సందడి కనిపించింది. సాయంత్రం ఇఫ్తార్ సమయంలో వివిధ ఆహార పదార్థాలు, మిఠాయిలు, చిరుతిండ్ల దుకాణాలు వెలిశాయి. ఇఫ్తార్‌లో వివిధ రకాల ఫలాలకు ప్రాధాన్యత ఇస్తుండగా, ఖర్జూరం, పైనాపిల్, యాపిల్, కర్బూజ, కళింగర, ద్రాక్ష వంటి పండ్లకు బాగా గిరాకీ ఏర్పడింది. నగరంలో వివిధ ప్రాంతాల్లో వెలసిన హలీమ్



కేంద్రాలు వినియోగదారులతో కిటకిటలాడాయి.

పట్టాభి'రాఘవుడు'



- ఘనంగా రాఘవేంద్రస్వామి 403వ పట్టాభిషేకం
- బంగారు సింహాసనంపై స్వామివారి పాదుకలు
- భక్తులతో కిక్కిరిసిన మంత్రాలయం
- కన్నుల పండువగా స్వర్ణ రథోత్సవం

మంత్రాలయం, మార్చి 12: మంత్రాలయం శ్రీరాఘవేంద్రస్వామి 403వ పట్టాభిషేకం మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. గురు వైభోత్సవాల్లో రెండో రోజు మంగళవారం రాఘవేంద్రస్వామి 403వ పట్టాభిషేక మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఊంజల మండపంలో బంగారు సింహానంపై రాఘవేంద్రస్వామి మూల బంగా రు పాదుకలకు ముత్యాలు, బంగారు నాణేలు, వెండి నాణేలు, వజ్రవైఢూర్యాలు, వివిధ రకాల పుష్పాలతో అభిషేకాలు చేసి మహామంగళహారతులు ఇచ్చారు. బంగా రు పాదుకలను బంగారురథంపై అధిష్ఠించి వేద పండి తుల మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ స్వర్ణ రథోత్సవం నిర్వహించారు. మూల రాములకు, జయ రాములకు, దిగ్విజయరాములకు పీఠాధిపతి ప్రత్యేక పూజలు చేసి బంగారు నాణేలతో అభిషేకించి హారతులు ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం ఆధ్వర్యంలో ముద్రించిన 2024 పంచాంగాన్ని పీఠాధిపతి ఆవిష్కరించారు. గురువైభ వోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి యోగీంద్ర కళామండపంలో చెన్నైలోని కోయంబత్తూరు చెందిన మహిమ శ్రీధర్‌లచే భరతనాట్యం, యోగశ్రీల ఆధ్యాత్మిక భక్తిగీలాపన ఆకట్టుకున్నాయి.



బంగారు రథంపై ఊరేగుతున్న రాఘవేంద్రస్వామి

ప్రముఖులకు అవార్డుల ప్రదానం



సోమిశెట్టికి అవార్డు ప్రదానం చేస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం రాఘవేంద్రస్వామి గురు వైభోత్సవాల్లో భాగంగా రెండో రోజు పట్టాభిషేక మహోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం రాత్రి యోగీంద్ర కళామండపంలో ప్రముఖులకు అవార్డులను పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ప్రదానం చేశారు. అవార్డులు అందుకున్నవారిలో ఎస్పీ జి. కృష్ణకాంత్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, కర్ణాటక దేవదాయశాఖ కమిషనర్ బసవరాజేంద్ర, కర్ణాటక రాష్ట్ర డిప్యూటీ సెక్రటరీ ఎస్.నాగరాజు అనసదొడ్డి, ఉడిపి ప్రముఖ ఫొటోగ్రాఫర్ అస్ట్రోమోహన్, ప్రముఖ సామాజికవేత్త ఆర్ఎస్ రవికుమార్, దేవరాయసముద్ర, బెంగుళూరు చెందిన ప్రముఖ అడ్వకేట్ ఫణిరాజ్ కశ్యప్‌లకు అవార్డులను అందజేశారు. అవార్డుతో పాటు నగదు, వెండిపల్లెం, శేషవస్త్రం, మెమెంటో, ఫలపుష్ప మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి సత్కరించారు. ఈ కార్యక్రమంలో గౌహతి హైకోర్టు రిటైర్డు చీఫ్ జస్టిస్ శ్రీధర్‌రావు, బెంగుళూరు ప్రముఖ పారిశ్రామికవేత్త కిరణ్, ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేశ్ జోషి, మంత్రాలయం, కోసిగి సీఐలు ఎరిషావలి, ప్రసాద్, ఎస్ఐ గోపీనాథ్, ఏఎస్ఐ ఆనందరెడ్డి, ఈఈ సురేష్ కోనాపూర్ తదితరులు పాల్గొన్నారు.



బంగారు మండపంలో మూలరాములకు పూజలు



ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు



బంగారు రథంపై పీఠాధిపతి, శ్రీమఠం అధికారులు



ఎస్పీకి అవార్డును ప్రదానం చేస్తున్న పీఠాధిపతి

మంత్రాలయంలో వందేభారత్ రైలు ప్రారంభం



తుంగభద్ర రైల్వేస్టేషన్‌లో వందేభారత్ రైలును ప్రారంభిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలకంఠ

మంత్రాలయం, మార్చి 12: మంత్రాలయం మండలంలోని తుంగభద్ర (మంత్రాలయం రోడ్డు) రైల్వేస్టేషన్‌లో మంగళవారం ఉదయం వందేభారత్ రైలును బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ, స్టేషన్ మాస్టర్ కాశీనాథ్ జెండా ఊపి ప్రారంభించారు. కర్ణాటక రాష్ట్రం కలబుర్గి నుంచి మంత్రాలయం మీదుగా బెంగుళూరుకు వెళ్తున్న వందేభారత్ రైలును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేష్ నాయుడు, నరేంద్ర, నియోజక కోకన్వీనర్ చిన్న ఈరన్న, మండల అధ్యక్షుడడు శ్రీకృష్ణ, పురుషోత్తంగౌడు, బంగారయ్య, రాఘవేంద్ర కులకర్ణి, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

మల్లన్న హుండీ ఆదాయం రూ. 5.16 కోట్లు



మల్లన్న కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

శ్రీశైలం, మార్చి 12: శ్రీశైల మహాక్షేత్రంలో భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లకు భక్తులు సమర్పించిన కానుకలను మంగళవారం లెక్కించారు. లెక్కింపులో ఆలయ హుండీల ద్వారా రూ.5,08,66,006, అన్నప్రసాద వితరణ హుండీ ద్వారా రూ.8,18,411 రాగా మొత్తం రూ.5,16,84,417 నగదు రూపంలో రాబడిగా లభించింది. ఆలయ హుండీ ఆదాయాన్ని భక్తులు గత 13 రోజులలో, అన్నదానం హుండీ ఆదాయాన్ని డిసెంబరు 13వ తేదీ నుంచి మార్చి 11వ తేదీ వరకు సమర్పించారు. నగదుతో పాటు 122 గ్రాముల 400 మిల్లీగ్రాముల బంగారు, 5.90 కిలోల వెండి లభించాయి. అదేవిధంగా 240 యూఎస్ఏ డాలర్లు, 30 ఆస్ట్రేలియా డాలర్లు, 20 యూఏఈ దిర్హమ్స్, 25 సింగపూర్ డాలర్లు మొదలైన విదేశీ కరెన్సీ ఈ హుండీ లెక్కింపులో లభించాయి. పటిష్టమైన భద్రతా, సీసీ కెమెరాలు, అధికారుల పర్యవేక్షణలో హుండీ ఆదాయాన్ని లెక్కించినట్లు ఈఓ పెద్దిరాజు వెల్లడించారు. ఈ హుండీ లెక్కింపులో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ అధికారి ఆర్.రమణమ్మ, అన్ని విభాగాల అధిపతులు, పర్యవేక్షకులు, సిబ్బంది, శివసేవకులు పాల్గొన్నారు.

పేదల ఇళ్లకు ఉచిత సౌర విద్యుత్

- రాయితీపై సోలార్ రూఫ్ టాప్ ప్యానళ్ల ఏర్పాటు
- అమలులోకి తెచ్చిన కేంద్రం
- దరఖాస్తుకు విధి విధానాలు జారీ



కర్నూలు(అగ్రికల్చర్), మార్చి 12: రాష్ట్ర ప్రభుత్వం వివిధ రూపాల్లో విద్యుత్ బిల్లులను భారీగా పెంచడంతో వినియోగదారులు అల్లాడిపోతున్నారు. విద్యుత్ భారాన్ని తట్టుకోలేక ఇదేమి ఖర్మరా.. బాబోయ్ అంటూ గగ్గోలు పెడుతున్నారు. ఈ భారాన్ని పేదలు తగ్గించుకునేందుకు కేంద్రప్రభుత్వం ఇటీవల సౌర విద్యుత్ పథకాన్ని అమలులోకి తెచ్చింది. పేద, మధ్యతరగతి నివాస గృహాల్లో రాయితీతో సోలార్ రూఫ్ ట్యాప్ ప్యానెళ్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఈ పథకానికి పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన పథకాన్ని అమలులోకి తెచ్చింది. అధిక విద్యుత్‌తో వివిధ రూపాల్లో చార్జీల భారంతో అవస్థలు పడుతున్న ఈ పథకం పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో ఊరట కలగనుంది. దరఖాస్తులను నేషనల్ పోర్టల్ https://pmsuryaghar.gov.inలో సమర్పించాల్సి ఉంటుందని కలెక్టరేట్‌లోని నెట్‌క్యాప్ అధికార వర్గాలు తెలిపాయి. ఈ పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు ఆరు నెలలకు తక్కువ కాకుండా విద్యుత్ బిల్లు ప్రతిని దరఖాస్తుకు జత చేయాలి. అలాగే వ్యక్తిగత నివాస సమూహ గృహ కామన్ సర్వీసులకు ఇది వర్తిస్తుంది. ఈ ప్రక్రియ పూర్తయ్యాక దరఖాస్తుదారులు నెట్ మీటరు కోసం అప్లయ్ చేసుకోవాలి. నెట్ మీటరును అమర్చుకున్న తర్వాత దరఖాస్తుదారులు పోర్టల్‌లో బ్యాంకు ఖాతా వివరాలను అప్‌లోడ్ చేయాలి. కేంద్రప్రభుత్వం వినియోగదారుల దరఖాస్తును పరిశీలించి అన్ని పత్రాలు సక్రమంగా ఉన్నట్లు నిర్ధారణ చేసిన తర్వాత సబ్సిడీ 30 రోజుల్లోగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు చెల్లిస్తారు. కిలో వాట్ సోలార్ రూఫ్‌ట్యాప్‌ను అమర్చడానికి ఇంటి పైకప్పు మీద 10 చదరపు మీటర్ల స్థలం ఉండాలి. ఇంటి పైకప్పు పటిష్టతపై ధ్రువీకరణ తప్పనిసరిగా ఇవ్వాల్సి ఉంటుంది.

ఇవి ఉపయోగాలు

కిలో వాట్ సోలార్ రూఫ్‌ట్యాప్ ప్యానెల్ ఏర్పాటు వల్ల దాదాపు 125 యూనిట్లను ఆ ప్యానెల్ ద్వారా ఉత్పత్తి అవుతుంది. దీంతో వినియోగదారులు డిస్కం నుంచి భారీ స్థాయిలో కరెంటు చార్జీ భారాన్ని తగ్గించుకునే అవకాశం ఉంటుంది. కనీస విద్యుత్ బిల్లులను పొందుతారు.

త్రిశంకు స్వర్గంలో నిరుద్యోగులు

- యువతను మోసగించిన జగన్
- నిరుద్యోగ గర్జనసభలో మాజీ ఎమ్మెల్యే గౌరుచరిత

కల్లూరు, మార్చి 12: గత ఎన్నికల్లో యువత ఓట్లతో గద్దెనెక్కిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించకుండా వారి జీవితాలను త్రిశంకుస్వర్గంలోకి నెట్టాడని మాజీ ఎమ్మెల్యే గౌరుచరిత ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం కర్నూలు నగరంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో రాయలసీమ నిరుద్యోగ గర్జనసభ జరిగింది. ఈ సభకు నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జ్ గౌరు వెంకటరెడ్డి, గౌరుచరిత, ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇస్తానన్న జాబ్ క్యాలెండర్ మాట ఏమైందని ప్రశ్నించారు. మెగా డీఎస్సీ అంటూ మోసం చేసిన సీఎం జగన్ తీరా ఎన్నికల ముందు నామమాత్రపు పోస్టులను ఇవ్వడం సిగ్గుచేటన్నారు. రాబోయేది తెలుగుదేశం ప్రభుత్వమేనని, నిరుద్యోగులకు అన్నివిధాల అండగా ఉంటామని ఆమె భరోసానిచ్చారు. నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న సీఎం జగన్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ మాట్లాడుతూ ఓర్వకల్లులో టీడీపీ ప్రభుత్వం సోలార్‌పరిశ్రమ, జయరాజ్‌ఇస్పాత్‌య స్టీల్‌ప్లాంటు, డీఆర్డీఓ, ఎయిర్‌పోర్టులను స్థాపిస్తే పాణ్యం వైసీపీ ముఖ్యనేతలు యాజమాన్యాలను వేధిస్తూ దోచుకుతింటున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ విద్యార్థి యువజన సంఘాల జేఏసీ చైర్మన్ శ్రీరాములు, నంద్యాల పార్లమెంట్ తెలుగు మహిళా అధ్యక్షురాలు కె. పార్వతమ్మ, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌యాదవ్, మోహన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నాగముని జేఏసీ నేతలు అయ్యస్వామి, కోనేటి వెంకటేశ్వర్లు, అంజి, రవీంద్రనాథ్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.



రాయలసీమ నిరుద్యోగ గర్జనసభలో మాట్లాడుతున్న గౌరుచరిత

రోగుల భోజనాన్ని పర్యవేక్షించాలి



సమీక్ష నిర్వహిస్తున్న ఆసుపత్రి సూపరింటెండెంట్

కర్నూలు(హాస్పిటల్), మార్చి 12: కర్నూలు ప్రభుత్వాసుపత్రిలోని రోగులకు అందుతున్న భోజనాన్ని సెక్యూరిటీ, శానిటేషన్‌లపై ఆయా హెచ్‌వోడీలు పర్యవేక్షించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.వి.వెంకటరంగారెడ్డి అన్నారు. మంగళవారం ధన్వంతరి హాలులోని ఆరోగ్యశ్రీ, ఈ హాస్పిటల్స్‌పై హెచ్‌వోడీలతో ఆయన డిప్యూటీ సూపరింటెండెంట్ డా.సి. ప్రభాకర్ రెడ్డితో కలిసి సమీక్ష నిర్వహించారు. అసలు రోగులకు ఇచ్చే డైట్ నాణ్యత ఎలా ఉంది..? ఏం పెడుతున్నారో.. ఎప్పుడైనా మీరు పరిశీలించారా..? అని ప్రశ్నించారు. హై ప్రొటీన్ డైట్‌కు, నార్మల్ డైట్‌కు ప్రభుత్వం ఎంత చెల్లిస్తుందో తెలుసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో ఆసుపత్రి సీఎస్ఆర్ఎంవో వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓ హేమనళిని, ఆర్ఎంవో వెంకటరమణ పాల్గొన్నారు.

నెలవారి మరణాలపై సమీక్ష : కర్నూలు మెడికల్ కాలేజీ న్యూలెక్చర్ హాలులో నెలవారి మరణాలపై సమీక్ష జరిగింది. మెడికల్, పీడియాట్రిక్ డిపార్టుమెంట్‌లకు సంబంధించిన రెండు కేసులపై ప్రజెంటేషన్ ద్వారా సమీక్ష చేశారు. మెడిసిన్ విభాగం నిర్వహించిన ప్రజెంటేషన్‌లో కేషీట్ సరిగ్గా నమోదు చేయకపోవడంపై ఆసుపత్రి సూపరింటెండెంట్ అసహనం వ్యక్తం చేశారు. సమీక్షలో ఆసుపత్రి సూపరింటెండెంట్ వెంకటరంగారెడ్డి, డిప్యూటీ సూపరింటెండెట్ ప్రభాకర్ రెడ్డి, హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ: కలెక్టర్



కర్నూలు(కలెక్టరేట్), మార్చి 12: పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణలో భాగంగా జిల్లాలో 43 పోలింగ్ కేంద్రాలకు లోకేషన్ మార్పు, 107 పోలింగ్ కేంద్రాలకు పేరు మార్పు జరిగిందని కలెక్టర్ డా.జి. సృజన అన్నారు. మంగళవారం పోలింగ్ కేంద్రాల మార్పు, జర్నలిస్టు హౌసింగ్ స్కీం అంశాలపై మండల స్పెషల్ ఆఫీసర్లు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణలో భాగంగా లోకేషన్ మార్పుకు సంబంధించి 43, పేరు మార్పుకు సంబంధించి 107, యాగ్జిలరీ పోలింగ్ కేంద్రాలు 18 కోసం ప్రతిపాదనలు పంపించామని అన్నారు. పోలింగ్ కేంద్రం ఎక్కడుందో తెలియక ఓటు వేయలేదనే పరిస్థితి రాకూడదన్నారు. ఏ పోలింగ్ కేంద్రాన్ని ఎక్కడ నుంచి ఎక్కడకు మార్చామనేది ఆ ప్రాంతాలలో ఒక వారం పాటు స్పెషల్ క్యాంపెయిన్ చేయాలని నాన్నారు. జర్నలిస్టు హౌసింగ్ స్కీమ్‌కు సంబంధించి అన్ని మండలాల తహసీల్దార్లు, డివిజినల్ అధికారులు, ఆయా మండలాలు, నియోజకవర్గాల కేంద్రాల్లో గుర్తించిన భూమి బేసిక్ వాల్యూ ప్రపోజల్స్ మంగళవారంలోపు సిద్ధం చేసుకోవాలన్నారు. జిల్లా స్థాయిలో గార్గేయపురం స్థలానికి ప్రభుత్వం నుండి త్వరలోనే స్పష్టత రావచ్చన్నారు. స్పష్టత రాగానే పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉండాలని అన్నారు. జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, మున్సిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ, ఆదోని సబ్‌కలెక్టర్ శివ్‌నారాయణ శర్మ, కర్నూలు ఆర్డీవో శేషిరెడ్డి, పత్తికొండ ఆర్డీవో రామలక్ష్మి, జడ్పీ సీఈవో నాసరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి బ్రహ్మోత్సవాలు విజయవంతం

- మహానందీశ్వరుడికి ఆదాయం రూ.58,28,276

మహానంది, మార్చి 12: మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలను అన్ని శాఖల సమష్టి కృషితో దిగ్విజయంగా పూర్తి చేసామని మహానంది ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మహానంది దేవస్థానం ప్రధాన కార్యాలయంలో బ్రహ్మోత్సవాల నిర్వహణపై ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది శివరాత్రి బ్రహ్మోత్సవాలకు రూ..58,28,276 ఆదాయం వచ్చిందన్నారు. గత ఏడాది జరిగిన ఉత్సవాల కంటే రూ. 3 లక్షలకు పైగా ఆదాయం దేవస్థానానికి వచ్చినట్లు ఈవో చెప్పారు. దర్శనానికి వచ్చే భక్తులు స్వచ్ఛందంగా సేవా టిక్కెట్లు కొనుగోలు చేసి వెళ్ళడం ద్వారానే ఇంత ఆదాయం వచ్చిందన్నారు. ప్రసాదాల విక్రయాలు అంతగా జరగలేదన్నారు. పార్కింగ్ స్థలంలో విద్యుత్ ఏర్పాట్లపై జరిగిన పొరబాట్లు కొన్ని తన దృష్టికి వచ్చాయని, మరోసారి ఇలా జరగకుండా చేస్తామన్నారు. మంగళవారం ఆలయంలో యథావిధిగా గర్భాలయ పూజలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ఏఈఓలు ఎర్రమల్ల మధు, వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యశాఖలో ఉద్యోగ సంఘాల ఆధిపత్య పోరు

- కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులర్ విషయంలో వివాదం

కర్నూలు(హాస్పిటల్), మార్చి 12: కర్నూలు జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో రెండు ఉద్యోగ సంఘాల మధ్య ఆధిపత్యపోరు మొదలైంది. ఉమ్మడి జిల్లాలో కాంట్రాక్టు ఉద్యోగులు 167 మంది ఉన్నారు. వీరందరిని రెగ్యులరైజేషన్ చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇందులో ఉమ్మడి జిల్లాకు చెందిన 129 మంది సర్వీసును రెగ్యులర్ చేస్తూ డీఎంహెచ్‌వో ప్రొసిడింగ్ ఆర్డర్స్ ఇచ్చారు. అయితే కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్ విషయంలో ఘనత మాదంటే మాదని వాదించుకొనే క్రమంలో రెండు సంఘాలు వాట్సాప్‌లో దుమ్మెత్తి పోసుకున్నాయి. డీఎంహెచ్‌వోపై ఒత్తిడి తెచ్చి సర్క్యులర్ విడుదల చేయించారని ఓ యూనియన్ డీఎంహెచ్‌వో ఆదేశాల మేరకు ప్రొసీడింగ్ ఆర్డర్స్ ఇచ్చారని మరో యూనియన్ అంటుంది. కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులర్ జాయినింగ్ రిపోర్టులు వైద్యాధికారులు తీసుకోవడం లేదని ఓ సంఘం ఆరోపిస్తున్నది. ఏప్రిల్ 1 నుంచి రెగ్యులర్ ప్రక్రియ అమలవుతుందని మరో సంఘం అంది. దీనిపై డీఎంహెచ్‌వో డా.బి. రామగిడ్డయ్య ఏప్రిల్ 1 నుంచి కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులర్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. ప్రభుత్వం ఆన్‌లైన్ ద్వారా త్వరలో రెగ్యులర్ ఆర్డర్స్ ఇవ్వనుంది. వాట్సాప్ అంశం తన దృష్టికి రాలేదని, ఇది రెండు యూనియన్ల మధ్య జరిగినట్లుగా ఉందని తెలిపారు.

ఇంటర్ పరీక్షకు 942 మంది విద్యార్థులు గైర్హాజరు

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 12: జిల్లాలో ఇంటర్మీడియట్ ఫస్టియర్ పరీక్షల్లో మంగళవారం 942 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆర్ఐఓ ఎస్వీఎస్ గురువయ్యశెట్టి తెలిపారు. 23,974 మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 942 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని తెలిపారు.

గుంటూరులో వలస కూలీ మృతి

కౌతాళం, మార్చి 12: స్వగ్రామంలో సరైన పనులులేక, పంటలు పండక పొట్టకూటి కోసం గుంటూరుకు వెళ్లిన వలస కూలీ అక్కడ పనులు చేస్తూ వడ దెబ్బకు గురై మంగళవారం మృతి చెందాడు. దీంతో కౌతాళంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామంలోని పింజారి వీధికి చెందిన కంబళదిన్నె ఉసేన్‌సాబ్(54) గత 45 రోజుల క్రితం పొట్ట చేతపట్టుకుని కుటుంబ పోషణ కోసం గుంటూరులో మిరప కోత పనులకు వెళ్లాడు. అక్కడ వడదెబ్బకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు వైద్యం చేయించినా కోలుకోలేక మంగళవారం మృత్యువాత పడ్డాడు. మృతునికి నలుగురు ఆడపిల్లలు సంతానం. మృతదేహాన్ని గుంటూరు నుంచి స్వగ్రామానికి తీసుకువస్తున్నట్లు బంధువులు తెలిపారు.

టీడీపీ ఫ్లెక్సీ దహనంపై ఫిర్యాదు



ఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

కోడుమూరు(రూరల్), మార్చి 12: మండలంలోని ప్యాలకుర్తి స్టేజీ వద్ద టీడీపీ నాయకుల ఫ్లెక్సీని గుర్తు తెలియని దుండగులు దహనం చేశారు. ఈనెల 8న చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా ప్యాలకుర్తికి వచ్చారు. ఈ సందర్భం గా దివంగత ఎన్టీఆర్, చంద్రబాబు, అచ్చెన్నాయుడు, కోట్ల జయ సూర్యప్రకాష్‌రెడ్డి, బీటీ నాయుడు, విష్ణువర్ధన్‌రెడ్డి, బొగ్గుల దస్తగిరి తదితర నాయకులతో కూడిన ఫ్లెక్సీని టీడీపీ శ్రేణులు ఏర్పాటు చేశారు. అయితే సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు ఫ్లెక్సీని చింపి నిప్పంటించారు. ఉదయం విష యం తెలుసుకున్న టీడీపీ నాయకులు ఎస్ఐ బాలనరసింహులుకు ఫిర్యాదు చేశారు. దుండగులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు యల్లప్ప నాయుడు, బడేసాబ్‌గౌడ్, చేనేత భాస్కర్, బలరాం, బాలక్రిష్ణయ్య మాట్లాడుతూ శాంతిభద్రతలకు భంగం కలిగించే విధంగా వ్యవహరించడం సరికాదన్నారు. కార్యక్రమంలో రాజోలు గిడ్డయ్య, మధు పాల్గొన్నారు.

మహిళల రక్షణ కోసం ఉద్యమిద్దాం

శ్రామిక మహిళా కన్వీనర్ పి. నిర్మల



మాట్లాడుతున్న పి. నిర్మల

కర్నూలు(న్యూసిటీ), మార్చి 12: మహిళల రక్షణ కోసం ఉద్యమిద్దామని శ్రామిక మహిళా కన్వీనర్ పి. నిర్మల పిలుపునిచ్చారు. మంగళవా రం బుధవారపేటలోని మెరిడి యన్ ఫంక్షన్ హాలులో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐద్వా జిల్లా కార్యదర్శి అలివే లమ్మ అధ్యక్షతన ఐద్వా, శ్రామిక మహిళ సంఘం, యూటీఎఫ్ అధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా నిర్మల మాట్లాడుతూ మహిళలను ప్రోత్సహించడంలో ప్రభుత్వాలు ముందుకు రావా లని కోరారు. కార్యక్రమంలో సీడీపీఓ అనూరాధ, యూటీఎఫ్ జిల్లా కార్య దర్శి లక్ష్మీదేవి, అంగన్‌వాడీ టీచర్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రేణుక, పుణ్యవతి, టీఎల్ఎఫ్ అధ్యక్షురాలు కిరణ్మయి పాల్గొన్నారు.

మూడు రాజధానులతో సీమకు అన్యాయం



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

కర్నూలు(అర్బన్), మార్చి 12: మూడు రాజధానులతో రాయలసీమకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆర్‌వీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు సీమకృష్ణ అన్నారు. మంగళవారం నగరంలోని బిర్లా కాంపౌండ్‌లో రాయలసీమ విద్యార్థి సమాఖ్య కార్యాలయంలో రాయలసీమ అస్తిత్వం ఆత్మగౌరవం, హక్కుల సదస్సు కరపత్రాలను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019లో అధికారం చేపట్టిన వైసీపీ రాయలసీమలో 52 ఎమ్మెల్యే స్థానాలకు గాను 49 స్థానాల్లో గెలిచినా అభివృద్ధి శూన్యమన్నారు. విభజన చట్టంలో చేసిన గుంతకల్లు రైల్వే జోన్, కడపకు ఉక్కు పరిశ్రమ తీసుకురాలేకపోయారని, శ్రీబాగ్ ఒప్పందం పేరుతో మూడు రాజధానుల బిల్లును వెనక్కి తీసుకుని రాయలసీమకు తీవ్ర అన్యాయం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కృష్ణ యాజమాన్య బోర్డు రాయలసీమలో ఏర్పాటు చేయకుండా వైజాగ్‌లో ఏర్పాటు చేస్తున్నారని మండిపడ్డారు. నీళ్ల నిధులు నియామకాల్లో రాయసీమకు వైసీపీ తీవ్ర అన్యాయం చేసిందన్నారు. కార్యక్రమంలో ఆర్‌వీఎస్ నాయకులు భూషణ్, చంద్రనాయక్, వెంకటేష్, రాముడు, గణేష్ పాల్గొన్నారు.

గ్రంథాలయాలు..ఆధునిక దేవాలయాలు

ఓర్వకల్లు, మార్చి 12: గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు అని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం ఓర్వకల్లులో రూ.25లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రంథాలయ భవనాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సెక్రటరీ ప్రకాష్, జడ్పీటీసీ రంగనాథగౌడు, ఎంపీపీ తిప్పన్న, ఎంపీటీసీ షాకీరు స్నీసా, ఉప సర్పంచ్ నాగేశ్వరమ్మ, ఓర్వకల్లు గ్రంథాలయ అధికారి హనుమాన్ నాయక్ పాల్గొన్నారు.

మెప్మా ఆధ్వర్యంలో వైద్యశిబిరం

కర్నూలు(న్యూసిటీ), మార్చి 12: మెప్మా అధ్వర్యంలో నగరంలోని శ్రీరామ్‌నగర్‌లోని నిరాశ్రయుల వసతి గృహంలో ప్రసన్న హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ సొసైటీ సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మంగళవారం నిర్వహించిన ఈ శిబిరానికి మెప్మా పీడీ నాగశివలీల, డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక హాజరయ్యారు. వైద్యులు నిరాశ్రయులకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం వారికి దుప్పట్లు, కడువాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీపీఆర్ఓ వెంకటలక్ష్మి, సీఎంఎం మురళి, టీఎంసీ విజయభారతి, సుధాకర్, సీఓలు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే అభివృద్ధి

మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత

కల్లూరు, మార్చి 12: టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు ప్రభుత్వ హయాంలోనే రాష్ట్రంలో అభివృద్ధి జరిగిందని మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. మంగళవారం కల్లూరు అర్బన్ 19వ వార్డు లక్ష్మీటౌన్‌షిప్‌లో ఆమె శంఖారావం, బాబు ష్యూరిటీ..భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం టీడీపీ మేనిఫెస్టో పత్రాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా గౌరు చరిత మాట్లాడుతూ టీడీపీ కూటమి రానున్న ఎన్నికల్లో విజయఢంకా మోగించడం ఖాయమన్నారు. గత ఎన్నికల్లో జగన్‌రెడ్డి ప్రభుత్వ ఉద్యోగులకు సీపీఎస్ రద్దు, ప్రత్యేక హోదా, పోలవరం నిర్మాణం, విభజన హామీల అమలు, ప్రతి ఏడాది జనవరిలో జాబ్ క్యాలెండర్, ప్రజలపై పన్నులు, చార్జీల భారం వేయనని, మద్యపాన నిషేధం అమలు చేస్తానని ఘోరంగా విఫలం అయ్యారన్నారు. క్షేత్రస్థాయిలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కార్యకర్తలు వైసీపీ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టోను ప్రతి కుటుంబానికి చేర్చాలన్నారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్, పాణ్యం వాణిజ్య విభాగం అధ్యక్షుడు బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, వంగాల జనార్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ మేనిఫెస్టో పత్రాలను పంపిణీ చేస్తున్న గౌరు చరిత

గౌరు చరిత గెలుపునకు కృషి చేద్దాం.. పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరిత గెలుపునకు కృషి చేద్దామని వాణిజ్య విభాగం అధ్యక్షుడు బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం కల్లూరు అర్బన్ 26, 27 వార్డులలో శంఖారావం కార్యక్రమంలో భాగంగా నాగిరెడ్డి ఇంటింటికీ తిరిగి టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

వైసీపీకి మరో భారీ షాక్

» టీడీపీలో చేరిన గోరంట్ల సర్పంచ్ బాలకృష్ణ

కర్నూలు(రూరల్), మార్చి 12: కోడుమూరు నియోజకవర్గంలో వైసీపీకి మరో భారీ షాక్ తగిలింది. వైసీపీ ఎమ్మెల్యే డాక్టర్ జె.సుధాకర్ అనుచరుడు గోరంట్ల గ్రామ వైసీపీ సర్పంచ్ సద్దల బాలకృష్ణ తన అనుచరులతో మంగళవారం ప్రత్యేక వాహనాలలో కర్నూలుకు ర్యాలీ గా తరలివచ్చి టీడీపీ సీనియర్ నాయకుడు ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి, టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి సమక్షంలో పార్టీలో చేరారు. ఆయనతో పాటు ఉపసర్పంచు చిన్న మద్దిలేటి, 11మంది వార్డు సభ్యులు, వంద మంది వైసీపీ శ్రేణులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారందరికీ విష్ణు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం సర్పంచ్ బాలకృష్ణ మాట్లాడుతు వైసీపీలో సర్పంచ్‌లకు ఏ మాత్రం కూడా గౌరవం లేదని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సర్పంచ్‌లకు రావాల్సిన నిధుల కూడా వైసీపీ అధినాయకత్వం తమ జేబులోకి వేసుకున్నారని ఆరోపిం చారు. విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో పార్టీ లో చేరారని, ఎవరికి భయపడాల్సిన అవసరం లేదని, తాము అండగా ఉంటానని భరోసానిచ్చారు. టీడీపీలో చేరిన వారిలో వార్డు సభ్యులు మనోహర్, శ్రీనివాసుల నాయుడు, పరమేశ్వరుడు, మాదేశ్వరుడు, మౌనిక, మౌనిక, లక్ష్మీదేవి, మాదేశ్వరి, శ్రీరాములు, లక్ష్మి, సుంకన్న, రాజు, వైసీపీ కార్యకర్తలు మాదన్న, ఎల్లనాగన్న, మనోహర్, జయరాముడు, చింతమాను మల్లయ్య, కొప్పు లక్ష్మన్న, సద్దల లింగన్న, మధు, మద్దిలేటి, గిడ్డయ్య, కొత్తపల్లె లక్ష్మన్న, చంద్రశేఖర్, రామగిడ్డయ్య ఉన్నారు.



టీడీపీలో చేరిన గోరంట్ల సర్పంచ్ బాలకృష్ణ, వార్డు సభ్యులు

నామినేషన్ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలి


కర్నూలు ఈఆర్ఓ భార్గవతేజ



మాట్లాడుతున్న భార్గవతేజ

కర్నూలు(న్యూసిటీ), మార్చి 12: కర్నూలు నియోజకవర్గంలో నామినేషన్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని కర్నూలు అసెంబ్లీ నియోజవకర్గ రిటర్నింగ్ అధికారి, నగర పాలక సంస్థ కమిషనర్ భార్గవ తేజ అన్నారు. మంగళవారం కార్యాలయంలోని పాతకౌన్సిల్ హాలులో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో నామినేషన్ ప్రక్రియపై ఓరియేంటేషన్ సమావేశం నిర్వహించారు. నామినేషన్ దాఖలు, ప్రతిపాదికులు, నామినేషన్ వ్యాలిడ్‌గా పరిగణించేందుకు కావాల్సిన ఫారాలు తదితర అంశాలపై ప్రతినిధు లకు కమిషనర్ అవగాహన కల్పించారు కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, అర్బన్ తహసీల్దారు మోహన్‌కుమార్, పట్టణ ప్రణాళిక సిబ్బంది సుబ్బన్న, అనంత వెంకటేష్ పాల్గొన్నారు.

18 నుంచి యాగంటీశ్వరుడి బ్రహ్మోత్సవాలు



యాగంటీశ్వరస్వామి

ఓర్వకల్లు, మార్చి 12: మండలంలోని ఎన్.కొంతలపాడు గ్రామంలో వెలసిన యాగంటీశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 18 నుంచి 20 తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో మద్దిలేటి, గ్రామ పెద్దలు మంగళవారం తెలిపారు. ఈనెల 18న ఉదయం స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకం, రాత్రి 9 గంటలకు సీతారాముల బృందం వారిచే చెక్కభజన, తెల్లవారుజామున ప్రభోత్సవం నిర్వహిస్తారు. 19న పంచామృతాభిషేకం, ధూపదీపనైవేద్యార్పణ, కర్నూలు బుధవారపేట వాస్తవ్యులు అంబలి అమర్నాథ్, చంద్రమౌళి ఆధ్వర్యంలో అన్న దాన కార్యక్రమాలు, రాత్రి 9 గంటలకు హైదరాబాదు జానపద కళా స్రవంతి వారిచే సినీ సంగీత విభావరి, తెల్లవారుజామున 4 గంటలకు రథోత్సవం, 20న సాయం త్రం పారువేట, నందికోలసేవ, పల్లకీ ఉత్సవాలు జరుగుతాయని ఆలయ ఈవో తెలిపారు. అదేవిధంగా ఈనెల 18న అంతర్రాష్ట్ర స్థాయి పురుషుల కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పగిడ్యాల రాజు, మాధవస్వామి తెలిపారు. వివరాలకు 9502177501, 9849290398 నెంబర్లను సంప్రదించాలన్నారు. అలాగే ఈనెల 20న అంతర్రాష్ట్ర స్థాయి పాలపండ్ల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు రైతు సంఘం నాయకులు తెలిపారు. విజేతలకు దాతలు నగదు బహు మతులు ప్రదానం చేస్తారు. వివరాల కోసం 9701338439, 9963628175 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

గ్రామాల్లో పోలీసుల కవాతు



ఉయ్యాలవాడలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

ఓర్వకల్లు, మార్చి 12: మండలంలోని ఉయ్యాలవాడ, లొద్దిపల్లె, నన్నూరు గ్రామాల్లో మంగళవారం ఎస్ఐ రాజారెడ్డి ఆధ్వర్యంలో పోలీసుల కవాతు నిర్వహించారు. గ్రామ వీధుల్లో తిరుగుతూ రాబోయే ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఓర్వకల్లు పోలీసులు, సీఆర్‌పీఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులు వీరే..

కర్నూలు(స్పోర్ట్స్), మార్చి 12: ఈనెల 23వ తేదీ నుంచి 27 వరకు మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు నలుగురు క్రీడాకారులు ఎంపికైనట్లు జిల్లా సంఘం కార్యదర్శి సువర్ణ తెలిపారు. కర్నూలు జిల్లాకు చెందిన షేక్షావలి, శేఖర్, మహమ్మద్ రఫీ, సంపత్ కుమార్ ఎంపికైనట్లు ఆమె తెలిపారు. ఇదివరకు పశ్చిమగోదావరి జిల్లా నారాయణపురంలో జరిగిన రాష్ట్ర స్థాయి జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి ఏపీ జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. జాతీయ స్థాయి పోటీల్లో రాణించి జిల్లాకు పేరు తీసుకురావాలని జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం ప్రతినిధులు కోరారు.

పేదల బియ్యం పట్టివేత



పట్టుబడ్డ బియ్యంతో అధికారులు

ఆదోని రూరల్, మార్చి 12 : పేదల బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్న ఇద్దరు వ్యక్తులను విజిలెన్స్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఆదోనికి చెందిన బియ్యం డాన్ రాజశేఖర్ తన అనుచరులు శివ, రమేష్ ద్వారా రెండు ఆటోల్లో 50 క్వింటాళ్ల బియ్యాన్ని మంగళవారం ఆస్పరికి తరలిస్తుండగా బైపాస్‌లో విజిలెన్స్ సీఐ రామకృష్ణ సిబ్బందితో కలిసి అదుపులో తీసుకున్నారు. కేసు నమోదు చేయడంతోపాటు పట్టుపడ్డ బియ్యాన్ని రెవిన్యూ అధికారులకు అప్పజెప్పినట్లు పోలీసులు తెలిపారు.

గోదా గోకులంలో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు

కర్నూలు(కల్చరల్), మార్చి 12: నగర శివారులోని మామిదాలపాడు లోని గోదా రంగనాథస్వామి వారి దేవస్థానం (గోదా గోకులం)లో మంగళవారం దేవస్థానం ప్రథమ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా పారంభ మయ్యాయి. ఈనెల 18 వరకు కొనసాగే ఈ బ్రహ్మోత్సవాలను అష్టాక్షరీ పీఠం పీఠాధిపతి శ్రీత్రిదండి అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామీజీ, శ్రీత్రిదండి అష్టాక్షరీ బృందావన రామానుజ సీయర్ స్వామిజీ పర్యవేక్షణలో ప్రారంభించారు. మంగళవారం ఉదయం స్వామి అమ్మవా ర్లకు సుప్రభాతం, అర్చన, విశేషాలంకరణ, విష్ణు సహస్రనామ పారా యణం చేశారు. సాయంత్రం ఉత్సవాలను ప్రారంభిస్తూ స్వస్తివాచనం, విష్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, అంకురార్పణ, ధ్వజాధివాసంతో బ్రహ్మో త్సవాలను ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. గోదా గోకులం వ్యవస్థాపక అధ్యక్షు డు మారం నాగరాజ గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాద, అల్పాహారం వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గోకులం సభ్యులు పాలాది సుబ్రహ్మణ్యం, బాలసుధాకర్, భూమా కృష్ణమోహన్, వేముల జనార్దన్, తల్లం సురేష్, తలుపుల శ్రీనాథ్, వెంకట సుబ్రహ్మణ్యం, ఎస్ హరిప్రకాశ్, వి.రవిప్రకాష్ పాల్గొన్నారు. బుధవారం జరిగే బ్రహ్మోత్సవాల్లో చిన్న జీయర్ స్వామి విచ్చేసి భక్తులకు ఆశీర్వాదక ప్రసంగం చేస్తారని, ఉదయం స్వామి, అమ్మవార్లకు శేషవాహన సేవ, సాయంత్రం కల్పవృక్ష వాహన సేవ, విష్ణు సహస్రనామ పారాయణాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.



హోమం చేస్తున్న వేద పండితులు

గ్రామాల్లో పడకేసిన పారిశుధ్యం

» ఇబ్బందులు పడుతున్న ప్రజలు



రోడ్డుపై నిలిచిన మురుగు నీరు

సి.బెళగల్, మార్చి 12: మండల కేంద్రమైన సి.బెళగల్‌తోపాటు ఇనగండ్ల, బ్యాదోలి, కొండాపురం తదితర గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. ఆయా గ్రామాల్లో రోడ్లపైనే మురుగు నీరు నిలుస్తోంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మురుగు నీరు నిల్వ ఉండటంతో దోమలు వ్యాప్తి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ప్రజలు సర్పంచులను అడిగితే నిధులు లేవు పంచాయతీలను ఎలా అభివృద్ధి చేయాలని చెబుతున్నారు.

దోమలతో అల్లాడుతున్నాం..



గ్రామంలోని రోడ్లపై మురుగు నీరు నిల్వ ఉంటోంది. రాత్రి పూట దోమలతో అల్లాడుతున్నాం. అధికారులు స్పందించి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి.
- ధనుంజయుడు. సి.బెళగల్

పారిశుధ్య పనులు చేయిస్తున్నాం..



గ్రామాలలో పారిశుధ్య పనులు చేపడుతున్నాం. దోమల నివారణకు కాల్వలో ఫాగింగ్ చేస్తున్నాం గ్రామాల్లో రోడ్లపై నిలిచిన మురుగునీరు తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం.
- ఈవోఆర్డీ సందీప్

రేపటి ధర్నాను జయప్రదం చేయండి



పోస్టర్‌ను విడుదల చేస్తున్న వివిధ సంఘాల నాయకులు

కర్నూలు(న్యూసిటీ), మార్చి 12: సంయుక్త కిసాన్ మోర్చా ఈ నెల 14న ఢిల్లీలో తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కే.జగన్నాథం పిలుపునిచ్చారు. మంగళవారం ఏఐటీయూసీ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప అధ్యక్షతన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా జగన్నాథం మాట్లాడుతూ ఢిల్లీ ధర్నాకు అనుగుణంగా జిల్లాలోని అన్న మండల కేంద్రాల్లో ధర్నా నిర్వహించాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. జిల్లాలోని అన్ని మండలాలలో ఏఐటీయూసీ, సీఐటీయూ, ఏపీ రైతు సంఘం, ఏఐకేఎస్, ఏపీ రైతు కూలీ సంఘం పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి అంజిబాబు, ఏఐటీయూసీ నగర కార్యదర్శి చంద్రశేఖర్, రేణుక, రామాంజనేయులు, నాగేంద్ర, సురేంద్ర పాల్గొన్నారు.

కేశవరెడ్డిలో క్విజ్ పోటీలు

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 12: నగరంలో అన్ని కేశవరెడ్డి పాఠశాలల్లో 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు మంగళవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. జనరల్ నాలెడ్జ్‌తోపాటు అన్ని సబ్జెక్టులపై ప్రశ్న లు, ఇమేజ్, ఆడియో, రాపిడ్ రౌండ్లను నిర్వహించారు. అన్ని రౌండ్లలో ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు విద్యాసంస్థల అధినేత ఎన్.కేశవరెడ్డి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకే ఈ పోటీలు నిర్వ హించామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, యాజ మాన్య సిబ్బంది పాల్గొన్నారు.

రాలుతున్న మామిడి పూత

» ఆందోళనలో రైతులు » అధికారుల పర్యవేక్షణ కరువు

ఓర్వకల్లు, మార్చి 12: జిల్లాలో ప్రధాన ఉద్యాన పంట మామిడి. గత ఆరు సంవత్సరాలుగా మామిడి రైతులకు గడ్డు పరిస్థితి ఎదుర్కొంటున్నారు. ఈ ఏడాది పూత బాగుండటంతో వ్యాపారులు, కౌలు రైతులు ఎగబడి మామిడి తోటలను కొనుగోలు చేశారు. ఈ ఏడాది మామిడిచెట్లకు పూత విపరీతంగా కనిపిస్తుంది. దీంతో పంట బాగా రావాలని ఆకాంక్షిస్తున్నారు. అయితే పెరిగిన ఎండ తీవ్రత, బంక తెగుళ్లతో పూత రాలిపోతున్నది. మండలంలోని పాలకొలను, ఉయ్యాలవాడ, చెన్నంచెట్టిపల్లె, కాల్వ, బ్రాహ్మణపల్లె, కాల్వబుగ్గ, నంద్యాల జిల్లా బేతంచెర్ల మండలం ఎంబాయి, రుద్రవరం, మండ్లవానిపల్లె, వెల్దుర్తి మండలంలోని రామళ్లకోట తదితర గ్రామాల్లో దాదాపు 6వేల ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. ఈ ఏడాది తమ కష్టాలు తీరుతాయని భావిస్తున్నారు. అయితే ఎండ తీవ్రత, బంక తెగుళ్ల ఆశించడంతో రైతులు లోలోన మదనపడుతున్నారు. గత ఐదు సంవత్సరాలుగా ప్రతి ఏటా పంట చేతికొచ్చే సమయానికి అకాల వర్షానికి, ఈదురుగాలికి పంట దెబ్బతిం టోంది. ఈ ఏడాదైనా తమ తలరాతలు మారుతాయనే ఆశతో రూ. లక్షలు వెచ్చించి మామిడి తోటలను కౌలుకు తీసుకున్నారు. పరిస్థితి చూస్తే ఈసారి కూడా అప్పులపాలవుతామేమో అనే భయం వాళ్లను వెంటాడుతున్నది. పూత నిలబడటానికి హార్టికల్చర్ అధికారులు ఎలాంటి సలహాలు ఇవ్వడం లేదు. వాళ్ల మామిడి తోటలవైపు కన్నెత్తి కూడా చూడడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మామిడి పంటకు సోకిన తెగుళ్లపై రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



పూతతో ఉన్న మామిడి చెట్టు

యేటా నష్టమే



నాకు ఐదెకరాల్లో మామిడి తోట ఉంది. ప్రతి యేటా పరిస్థితి అధ్వానంగా ఉంటోంది. ఎప్పుడూలేని విధంగా పూత బావుంది. ఎండకు, బంగ తెగుళ్లకు పూత రాలిపోతోంది. పంట చేతికొచ్చే సమయంలో మామిడికాయలు రాలిపోతున్నాయి. దీంతో రైతులు, కౌలు రైతులు నష్టాల్లో కూరుకుపోతున్నారు.
- గోవిందు, రైతు

తీవ్రంగా నష్టపోయాం



మూడెకరాల మామిడి తోటను రూ.3 లక్షలకు కౌలుకు తీసుకున్నా. పూత బావున్నా రాలిపోతోంది. మామిడికి ఏ తెగుళ్ల వచ్చిందో అర్థం కావడం లేదు. హార్టికల్చర్ అధికారులు తోటలపై కన్నెత్తి చూడడం లేదు. ఈ ఏడాదైనా లాభాలు వస్తాయని మామిడి తోటను కౌలుకు తీసుకున్నా.
- బత్తుల వెంకటరమణ, కౌలు రైతు

2015 నుంచి కరువే



2015 నుంచి ఇప్పటి వరకు మామిడి పంట చేతికొచ్చే సమయంలో అకాల వర్షం, గాలి వల్ల తీవ్రంగా నష్టపోతున్నాం. ఈ ఏడాది కాపు బావుంది. గత ఆరు సంవత్సరాల నుంచి పంట చేతికి రాక అప్పుల వలయంలో కూరుకుపోయాం. మామిడి రైతులు, కౌలు రైతులను ఆదుకోవాలి.
- నాగేశులు, రైతు

వైసీపీకి రోజులు దగ్గరపడ్డాయి

● బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి
● హోసూరులో కేఈ శ్యాంబాబు విస్తృత ప్రచారం

ఎమ్మిగనూరు, మార్చి 12: రాష్ట్రంలో అరాచక పాలన చేస్తున్న వైసీపీకి రోజుల దగ్గరపడ్డాయని మాజీ ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని 11 వార్డులో బాబుష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్‌పథకాలను వివరించారు. కాలనీలో చంద్రయ్యకొట్టాల దగ్గర దుర్గంధం వెదజల్లుతున్న మురికి కుంటను పరిశీలించారు. జగన్ ప్రభుత్వంలో పాలన ఎంత అధ్వానంగా ఉందో అర్థం అవుతుందని అన్నారు. నాలుగున్నరేళ్ల బటన్ నొక్కుతున్నా అంటూ ప్రజల పీకలు నొక్కుతున్నారని విమర్శించారు. ఎమ్మిగనూరు పట్టణానికి తాగునీటి సమస్యను తీర్చలన్న లక్ష్యంతో రూ. 144 కోట్లతో జీడీపీ నుంచి పైపు లైన్ పథకం తెస్తే జగన్ ప్రభుత్వం ఆ పథకాన్నిత పట్టించుకోకుండ వదిలేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికలలో టీడీపీని గెలిపించాలని కోరారు. వార్డు ఇన్‌చార్జి జహంగీర్, మాజీ కౌన్సిలర్స్‌లు ముల్లా సలామ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కొండయ్యచౌదరి, కౌన్సిలర్‌లు రామదాస్ గౌడ్, దయాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

నందవరంలో బీవీ ప్రత్యేక పూజలు

నందవరం : మండల కేంద్రం నందవరంలోని బంగారమ్మదేవర, మారెమ్మ దేవర సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి మండల టీడీపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రైతులు, ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరారు.

యువతకు ఉద్యోగభద్రత టీడీపీతోనే సాధ్యం : కేఈ

పత్తికొండ : రాష్ట్రంలో యువతకు ఉద్యోగభద్రత టీడీపీ ప్రభుత్వంతోనే సాధ్యమని పత్తికొండ ఎమ్మెల్యే అభ్యర్థి కేఈ శ్యాంబాబు అన్నారు.



ఎమ్మిగనూరు చంద్రయ్య కొట్లాలలో మురికికుంటను చూపుతున్న బీవీ, హోసూరులో ప్రచారం నిర్వహిస్తున్న కేఈ శ్యాంబాబు

బాబుష్యూరిటీ భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఆయన మంగళవారం పత్తికొండ మండల పరిధిలోని హోసూరు గ్రామంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఉద్యోగఅవకాశాలకోసం ఒక్కజాబ్‌క్యాలెండర్ కూడా విడుదలచేయలేదని విమర్శించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలో 20లక్షలమంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. యువగళం నిధినుంచి యువతకు నెలకు రూ 3,000 నిరుద్యోగభృతి చెల్లిస్తామని పేర్కొన్నారు. రానున్న ఎన్నికలలో టీడీపీకి ఓటువేసి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. టీడీపీనాయకులు కడవలసుధాకర్, వాకిటిశ్రీనివాసులు, గుడిసెనరసింహులు, రామాంజి జగ్గిలిఅంజి, రాఘవేంద్ర, శ్రీనివాసులుగౌడ్‌లతోపాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ విజయానికి పని చేయాలి

ఆలూరు, మార్చి 12: టీడీపీ బలోపేతానికి పార్టీ కార్యకర్తలు, నాయకులు పని చేయాలని ఆలూరు మాజీ టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ కోరారు. మంగళవారం ఆలూరులో ఆయన వ్యక్తిగత కార్యాలయంలో టీడీపీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఎన్నికలకు ప్రతి కార్యకర్త సంసిద్ధం కావాలన్నారు. టీడీపీను గెలిపించుకుంటే చంద్రబాబు నాయుడు సీఎం అవుతారని స్పష్టం చేశారు. సమావేశంలో మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ సాలీ సాహెబ్, బీసీ సెల్ నాయకులు ఉచ్చిరప్ప యాదవ్, టీడీపీ వైద్య సెల్ రాష్ట్ర నాయకులు డాక్టర్ నెట్టప్ప తదితరులు పాల్గొన్నారు.

పేదల బియ్యం పట్టివేత


పట్టుబడ్డ బియ్యంతో అధికారులు

ఆదోని రూరల్, మార్చి 12 : పేదల బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్న ఇద్దరు వ్యక్తులను విజిలెన్స్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఆదోనికి చెందిన బియ్యం డాన్ రాజశేఖర్ తన అనుచరులు శివ, రమేష్ ద్వారా రెండు ఆటోల్లో 50 క్వింటాళ్ల బియ్యాన్ని మంగళవారం ఆస్పరికి తరలిస్తుండగా బైపాస్‌లో విజిలెన్స్ సీఐ రామకృష్ణ సిబ్బందితో కలిసి అదుపులో తీసుకున్నారు. కేసు నమోదు చేయడంతోపాటు పట్టుపడ్డ బియ్యాన్ని రెవిన్యూ అధికారులకు అప్పజెప్పినట్లు పోలీసులు తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆదోని రూరల్, మార్చి 12 : ఆదోని వాల్మీకి నగర్‌కు చెందిన సురేష్ శేఖర్ అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తుండగా పెద్దతుంబళం పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం వీరిద్దరూ కర్ణాటక బస్సులో మద్యాన్ని ఆదోనికి తరలిస్తుండగా అదుపులో తీసుకొని వీరి నుంచి ఏడు మద్యం బాక్సులను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ వీరయ్య తెలిపారు. వాల్మీకి నగర్‌కు చెందిన నాగరాజు ప్రధాన నిందితుడిగా గుర్తించామని, ముగ్గురిని రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ తెలిపారు.

శాంతిభద్రతల పరిరక్షణకే ఫ్లాగ్ మార్చ్


ఆదోనిలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసు బలగాలు

ఆదోని, మార్చి 12: రాష్ట్రంలో త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో భాగంగా ఆదోని పట్టణంలోని టూటౌన్ సీఐ ఆధ్వర్యంలో కేంద్ర పోలీసు బలగాలు, సివిల్ పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా టూటౌన్, వన్ టౌన్, త్రీ టౌన్ సీఐలు గోపీనాథ్, తేజమూర్తి, నరసింహరాజ మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలందరూ సహకరించాలని, అసాంఘిక శక్తులకు సహకరించ వద్దని కోరారు. ఎస్ఎస్‌బీ అసిస్టెంట్ కమాండెంట్ రాజేష్, పోలీసులు పాల్గొన్నారు.

పంచాయతీ మార్కెట్ వేలం వాయిదా

ఆలూరు, మార్చి 12: ఆలూరు మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన బహిరంగ మార్కెట్ వేలం పాటలు వాయిదా వేస్తున్నట్లు పత్తికొండ డీఎల్‌పీవో ప్రకాష్ నాయుడు తెలిపారు. వారపు సంత మార్కెట్‌కు రూ.2.50 లక్షలు పలకడంతో, పంచాయతీకి ఆదాయం వచ్చే విధంగా లేకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు తెలిపారు.

16న ఆస్పరిలో మాలల మహాగర్జన

ఆలూరు, మార్చి 12: ఆస్పరిలో ఈ నెల 16న మాలల మహాగర్జన సభ నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు గుడిసె మహానంది తెలిపారు. మంగళవారం స్థానిక వాసవి కల్యాణ మండపం ఆవరణలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాలలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. వేదవతి ప్రాజెక్టును మూడు టీఎంసీల నుండి ఎనిమిది టీఎంసీలకు పెంచి ఆస్పరి మండలానికి తాగు, సాగునీరు అందించాలన్నారు. మాలలు ఐక్యంగా సభను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో మాల మహానాడు సీనియర్ నాయకులు ఈరన్న, మల్లప్ప, భరత్, వెంకటేష్, శంకరప్ప, వీరేష్ యువరాజు, లక్ష్మప్ప పాల్గొన్నారు.

'మాదిగలను విస్మరిస్తే.. ఎన్నికల్లో ఓడిస్తాం'

తుగ్గలి, మార్చి 12: మాదిగలను విస్మరించిన ప్రభుత్వాలకు ఎన్నికల్లో బుద్ధి చెబుతామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కోకన్వీనర్ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పెండేకల్ ఆర్ఎస్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏబీసీడీ వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చి విస్మరించారని, ఇలాంటి ప్రభుత్వాలకు ఓటుతోనే బుద్ధి చెబుతామని స్పష్టం చేశారు. తమ సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన పార్టీలకే ఓటు వేస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పులికొండ, నరసింహులు, ముత్యాల ఈశ్వరయ్య, రామ్‌లక్ష్మణ్, నాగన్న, తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాలు తగ్గుముఖం

తుగ్గలి, మార్చి 12: సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో నేరాలు తగ్గుముఖం పడుతాయని తుగ్గలి ఎస్ఐ మల్లికార్జున అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పెండేకల్ ఆర్ఎస్‌లో సీసీ కెమెరాల ఏర్పాటుపై చిరు వ్యాపారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల అసాంఘిక కార్యకలాపాలు జరుగవని, ఏవైనా అనుకోని సంఘటనలు జరిగినా సీసీ కెమెరాల ద్వారా నిందితులు వెంటనే పట్టుబడుతారన్నారు. అంతేగాకుండా ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, నేరప్రవృత్తిని వీడనాడాలని, గుర్తు తెలియని వ్యక్తులు గ్రామంలో సంచరిస్తే.. వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. త్వరలోనే ఎన్నికల నోటిఫికేషన్ రానుందని, ఎలాంటి దాడులు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే.. వారిపై బైండోవర్ కేసు నమోదు చేస్తామన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

పెద్దకడుబూరు, మార్చి 12: అంగన్వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టిక ఆహారాన్ని బాలింతలు, గర్భిణీలు తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని సీడీపీవో నాగమణి సూచించారు. మంగళవారం మండల పరిధిలోని హనుమాపురం గ్రామంలో పోషణ పక్వాడ్ కార్యక్రమం నిర్వహించారు.

కూలీలూ.. వలసలు వెళ్లొద్దు : పీడీ అమర్‌నాథ్‌రెడ్డి

గోనెగండ్ల, మార్చి12: గ్రామాల్లోని రైతులు, కూలీలు వలసలు వెళ్లొద్దని, గ్రామాల్లోనే ఉపాధి పథకం ద్వారా పనులు కల్పిస్తున్నామని డ్వామ పీడీ అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం గోనెగండ్ల మండల పరిధిలోని తిప్పనూరు గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. గతకొన్ని రోజులుగా కాలువ పూడికతీత, కుంటల పూడిక తీత పనులు జరుగుతున్నాయి వాటిని పరిశీలించి ఈ పనులకు రోజుకు ఎంతమంది కూలీలు హాజరవుతున్నారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ గ్రామాలలో చేపడుతున్న పనులకు ఉపాధి కూలీలు హాజరవాలని కోరారు. వలసల నివారణ కోసం ప్రతి గ్రామంలో ఉపాధి పనులు చేపడుతున్నామన్నారు. ప్రతి కూలీ బ్యాంక్ అకౌంట్‌కు ఆధార్‌కార్డు, జాబ్ కార్డు లింక్ చేసుకోవాలన్నారు. ప్రతి రోజూ ప్రతి ఉపాధి కూలీకి రూ. 270 కూలీ పడేలా పని చేయాలని సూచించారు. రైతులు పంట్ల తోటల పట్ల ఆసక్తిచూపాలని మామిడి, మునగ తదితర పంటలు సాగు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీవో మహమ్మద్ బాషా, ఉస్మాన్‌బాషా, ఉమామహేశ్వరమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.


కాలువ పూడికతీత పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ

రామాయణం మానవీయ విలువలకు దర్పణం

పెద్దకడుబూరు, మార్చి 12: శ్రీమద్ రామాయణం మానవీయ విలువలకు ప్రతీకగా నిలుస్తుందని తిరుమల తిరుపతి దేవస్థాన హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా శాఖ కార్య నిర్వాహకుడు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని హెచ్ మురవణి గ్రామంలోని ఆంజనేయ స్వామి దేవస్థానంలో ప్రారంభమైన టీడీపీ ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిరోజూ స్థానిక భజన మండలిచే భజనలు, బ్రహ్మచారి జయదేవానంద స్వామిచే మూడు రోజుల పాటు శ్రీమద్ రామాయణం, మహాభారతం, భగవద్గీతల పై ధార్మిక ప్రవచనాలు, శుక్రవారం గోపూజ, కుంకుమార్చన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భజన మండలి అధ్యక్షులు నంబి నరసింహమూర్తి, యూ గోవిందు, వీ శ్రీశైలాచారి, ఎం ఈరన్న, కే కృష్ణ, భూమిక, మనుమంతు, వీరేష్, జే భూషణ్, బీ గోవిందు, మల్లేష్, చాకలి కృష్ణప్ప పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

● ఇద్దరి పై కేసు నమోదు

గోనెగండ్ల, మార్చి 12: మండల పరధిలోని తిప్పనూరు గ్రామ సమీపంలోని బ్రిడ్జ్ దగ్గర అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్‌లను సీజ్ చేసి ట్రాక్టర్ యజమానులపై కేసు నమోదు చేసినట్లు సీఐ రామకృష్ణయ్య తెలిపారు. తిప్పనూరు గ్రామ బ్రిడ్జి దగ్గర మంగళవారం కోడుమూరు మండలం వర్కూరు గ్రామానికి చెందిన సాతర్ల రంగస్వామి, బోచ్చు మహేష్ లు తమ రెండు ట్రాక్టర్‌లో అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు కాపు కాచి ఇసుకను తరలిస్తున్న సమయంలో రెండు ట్రాక్టర్‌లను పట్టుకొని సీజ్ చేసి యజమానులైన రంగస్వామి, మహేష్ ఇద్దరి పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ప్రభుత్వ అధికారుల అనుమతు లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

హై లెవల్ బ్రిడ్జికి భూమిపూజ

గోనెగండ్ల, మార్చి 12: గంజహళ్లి తెర్నెకల్లు గ్రామాలకు మధ్యన ఉన్న హంద్రీలో రూ. 43.80 కోట్లతో హైలెవల్ బ్రిడ్జి పనులకు మంగళవారం ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి బుట్ట రేణుక భూమి పూజ చేశారు. బ్రిడ్జి నిర్మాణం వల్ల ఆయా గ్రామాల ప్రజలకు రైతులకు రాకపోకల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు బుట్టా నీలకంఠం, తిరుమలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ పాలనలోనే బీసీ గుర్తింపు

గోనెగండ్ల, మార్చి 12: టీడీపీ పాలనలోనే బీసీలకు రాజకీయాలలో మంచి గుర్తింపు వచ్చిందని, ప్రతి బీసీ టీడీపీకి ఓటు వేసి గెలిపించాని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి తిరుపతయ్యనాయుడు, జిల్లా మైనార్టీ నాయకులు బేతాలబడేసా అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన గోనెగండ్లలోని ఏడవ క్లస్టర్ కార్యకర్తల సమావేశం టీడీపీ కార్యలయ ప్రాంగణంలో నిర్వహించారు. అనంతరం దివంగత నేత మాజీ సీఎం ఎన్టీఆర్, మాజీ సీఎం చంద్రబాబు నాయుడి చిత్రపటాలకు నాయకులు, కార్యకర్తలు క్షీరాభిషేకం చేశారు. నాయకులు రంగస్వామినాయుడు, భారతం రహంతుల్లా, పక్కృద్దీన్, కులుమాల చాంద్‌బాషా పాల్గొన్నారు.

టీడీపీ గెలిస్తేనే భవిష్యత్తు

మద్దికెర : రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి గెలిస్తేనే.. భావితరాలకు మంచి భవిష్యత్తు ఉంటుందని టీడీపీ క్లస్టర్ కన్వీనర్ సుధాకర్‌చౌదరి, ఎస్సీ సెల్ నాయకులు ఆనంద్ కుమార్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఎం. అగ్రహారం గ్రామంలో చంద్రబాబును గెలిపిద్దాం.. భావితరాల భవిష్యత్తుకు బాటలు వేద్దామంటూ బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు.

దగా ప్రభుత్వాన్ని తరిమి కొడుదాం

తుగ్గలి : ఒక్క చాన్స్ అంటూ గద్దెనెక్కి ప్రజల నడ్డి విరుస్తున్న దగాకోరు ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపుదామని టీడీపీ నాయకులు, మాజీ సర్పంచు వీరభద్రప్ప అన్నారు. మండలంలోని పెండేకల్‌లో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి టీడీపీ మేనిఫెస్టోను వివరించారు.కార్యక్రమంలో నాయుడు, రాజు, కాశీం, తదితరులు ఉన్నారు.

మంత్రాలయం మార్కెట్ వేలం పాట

మంత్రాలయం, మార్చి 12: నియోజకవర్గ కేంద్రమైన మంత్రాలయం మేజర్ గ్రామ పంచాయతీ మార్కెట్ వేలం పాట ఈవోఆర్‌డీ ప్రభావతి దేవి అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శి బీవీ నాగరాజు నిర్వహించారు. మంగళవారం పంచాయతీ కార్యాలయంలో 2024-25 ఏడాదికి గానూ దినసరి మార్కెట్ గత ఏడాది రూ.81వేలు రాగా, ఈ ఏడాది 94వేలకు పెరిగింది. వారం సంత గత ఏడాది రూ.42వేలకు పాట పోగా.. ఈ ఏడాది రూ.49వేలకు దక్కించుకున్నారు. దీంతో వేలం ద్వారా పంచాయతీకి ఆదాయం అధికంగా సమకూరిందని పంచాయతీ సర్పంచు తెల్లబండ్ల భీమయ్య తెలిపారు. అధికంగా వేలం పాట అందుకున్న పాటదారుడు మాణిక్యం నరసయ్య కైవసం చేసుకున్నాడు. కార్యక్రమంలో వైస్ సర్పంచు హోటల్ పరమేష్, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో రైతు మృతి

పెద్దకడుబూరు, మార్చి 12: మండల పరిధిలోని చిన్నతుంబళం గ్రామానికి చెందిన రైతు కటికె ఖాదర్ తాను పండించిన మిరప పంటకు గిట్టుబాటు ధర లేనందుకు కలత చెంది మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి తిక్కారెడ్డి టీడీపీ గ్రామ నాయకులు వీరేష్ గౌడ్ చేతుల మీదుగా రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం ఈ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శివ, చంద్ర, నరసింహులు, మహాదేవ పాల్గొన్నారు.

నారా లోకేశ్‌ను కలిసిన శశికళ కృష్ణమోహన్

ఆలూరు, మార్చి 12: టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్‌ను మంగళవారం బళ్లారి మాజీ డిప్యూటీ మేయర్ మొలగవల్లి శశికళ కృష్ణమోహన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కనకదాసు విగ్రహన్ని బహూకరించారు. జిల్లాలో ఎంపీ, ఎమ్మెల్యే స్థానాలు కురువ వర్గానికి కేటాయించాలని కోరారు.

ఓబులేశ్వర స్వామి, చెంచులక్ష్మి ఉత్సవాలు ప్రారంభం

ఆస్పరి, మార్చి 12: మండల పరిధిలోని తొగలగల్లు గ్రామంలో భూమి నీలా చెంచులక్ష్మి, ఓబులేశ్వర స్వామి ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయని గ్రామ సర్పంచు ఆంజినయ్య యాదవ్, గ్రామ పెద్దలు లక్షన్న, మాజీ సర్పంచు కృష్ణ, సుదర్శన్ తెలిపారు. మంగళవారం వారు ఉత్సవాల వివరాలు వెల్లడించారు. 13వ తేదీ ఉదయం స్వామి వారికి గ్రామ దేవతలకు అభిషేకం, కలశ పూజ (బిందు) సేవతో పూజా కార్యక్రమాలు, రాత్రి పల్లకీ సేవ, మరునాడు 14వ తేదీ ఉదయం 9 నుంచి 10:30 వరకు ఓటులేశ్వర స్వామి, చెంచులక్ష్మి వారి కల్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాయంత్రం 7 నుంచి ప్రభావలి నిలబెట్టుట, రాత్రికి పల్లకీ సేవ, భజన కార్యక్రమం, రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

ఉరుకుంద హుండీ ఆదాయం రూ.1.12 కోట్లు

కౌతాళం, మార్చి 12: మండలంలో పుణ్యక్షేత్రం ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానంలో మంగళవారం స్వామి వారి హుండీ లెక్కింపు కార్యక్రమం ఆలయ డిప్యూటీ కమిషనర్ వెంకటేష్, పాలక మండలి చైర్మన్ నాగరాజుగౌడ్ ఆధ్వర్యంలో కొనసాగినది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్తులు స్వామి వారికి సమర్పించిన కానుకలను మంగళవారం లెక్కింపు కొనసాగగా నగదు రూపంలో రూ.1,12,13,277 విదేశీ కరెన్సీ నోట్‌లు 11 వచ్చినట్లు తెలిపారు. దేవాలయానికి చెందిన బంగారం, వెండితో మరో హుండీని బుధవారం కూడా లెక్కింపు కార్యక్రమం ఉంటుందని డీసీ తెలిపారు. కార్యక్రమంలో ఆదోని గ్రూపు టెంపుల్స్ ఈఓ రాంప్రసాద్, ఆలయ పాలక మండలి సభ్యులు విజయేంద్ర రెడ్డి, నరసింహులు, రెడ్డి గీత, లక్ష్మీరెడ్డి, నరసమ్మ, రమణి, ఆలయ అర్చక సిబ్బంది, దేవస్థానపు సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటి శాశ్వత పరిష్కారం

మంత్రాలయం, మార్చి 12: మంత్రాలయం మండలంలోని చిలకలడోన గ్రామంలో తాగునీటి కోసం రూ.15 లక్షలతో నీటిని నిల్వ చేసే సంపు నిర్మాణ పనులు చేపట్టారు. మూడు నెలల నుంచి చిలకలడోనలో తాగునీటికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. దీంతో వ్యవసాయ సలహామండలి చైర్మన్ సీవీ విశ్వనాథరెడ్డి, మండల పరిషత్, సర్పంచు సంయుక్త రూ.15 లక్షల నిధులతో తాగునీటి సంపును ఏర్పాటు చేసి అందులో నీటిని నింపి అక్కడి నుంచి కొళాయిలకు నీరు అందించే ప్రయత్నాలు చేస్తున్నారు. పనులు పూర్తయితే.. గ్రామానికి శాశ్వత పరిష్కారం లభిస్తుందని విశ్వనాథరెడ్డి అన్నారు.



చిలకలడోనలో స్టోరేజీ బెడ్‌ను నిర్మిస్తున్న దృశ్యం

21 నుంచి శ్రీరంగనాథ స్వామి బ్రహ్మోత్సవాలు

మద్దికెర, మార్చి 12: పెరవలి గ్రామంలో వెలసిన రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాలు విజయవంతం చేయాలని దేవాలయ చైర్మన్ ఈడిగ దస్తగిరిగౌడు, ప్రధాన అర్చకులు రంగస్వామి, సర్పంచ్ కారుమంచి మల్లికార్జున అన్నారు. మండలంలోని పెరవలి గ్రామంలో దేవాలయ ప్రాంగణంలో ఈ నెల 21 నుంచి 30వ తేదీ వరకు జరిగే బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 9 రోజుల పాటు జరుగుతాయన్నారు. ప్రతి రోజు ఒక్కొక్క అలంకరణలో భక్తులకు రంగనాథస్వామి దర్శనభాగ్యాన్ని కల్పించడం జరుగుతుందన్నారు. రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా దేవాలయాల్లో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.


పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

రాఘవేంద్రుని సన్నిధిలో కర్ణాటక మంత్రి


మఠం ప్రాంగణంలో ప్రదక్షిణలు చేస్తున్న కర్ణాటక మంత్రి

మంత్రాలయం, మార్చి 12: రాఘవేంద్రస్వామి దర్శనార్థం కర్ణాటక క్రీడాశాఖ మంత్రి బి.నాగేంద్ర, కర్నూలు జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు మంగళవారం మంత్రాలయం వచ్చారు. వీరు వేర్వేరు సమయాల్లో రాఘవేంద్రస్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వీరికి మఠం అధికారులు ఆలయ ముఖద్వారం వద్ద ఘనంగా స్వాగతం పలికి గ్రామదేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామిని దర్శించుకున్నారు. వీరి వెంట మఠం ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేశ్ జోషి, శ్రీపతాచార్, అనంతపురాణిక్, జేపీ స్వామి, బిందు మాధవ్, ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య, సీఐ ఎరిషావలి, మాధవరం ఎస్ఐ క్రిష్ణమూర్తి, ఏఎస్ఐ ఆనందరెడ్డిలు పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

మద్దికెర, మార్చి 12: ప్రభుత్వ పాఠశాలల్లో, వసతి గృహాల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ ఏడాది వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికలు రూపొందించి చదివిస్తున్నారని మండల విద్యాధికారి రంగస్వామి తెలిపారు. మంగళవారం స్థానిక వసతి గృహంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని పేర్కొన్నారు.

రేపటి నుంచి పులికొండ రంగనాథస్వామి ఉత్సవాలు

పత్తికొండ , మార్చి 12 : మండల పరిధిలోని పులికొండ గ్రామంలో పులికొండ రంగనాథస్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలు ఈ నెల 14నుంచి 17 వరకు జరుగుతాయని ఆలయ కార్య నిర్వహణాధికారి చంద్రశేఖర్‌రెడ్డి తెలి పారు. మంగళవారం ఆయన బ్రహ్మోత్సవాల వివరాలను వెల్లడించారు. 14వ తేదీ కలశస్థాపన, అంకురార్పణం, 15వతేదీ స్వామివారి అభిషేకం, పల్లకీసేవ, 16వతేదీ ఉదయం 10గంటలకు స్వామివారి కల్యాణం, సాయంత్రం అశేషజనవాహిని నడుమ రథోత్సవం కార్యక్రమాలు ఉంటాయన్నారు. 17వ తేదీ వసంతోత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండే కాక తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలనుంచి వచ్చే భక్తులకు ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు.

'ఒంటిపూట బడులు అమలు చేయండి'

మద్దికెర, మార్చి 12: వేసవి కాలం ఆరంభమైందని.. ఎండలు మండిపోతున్నాయని.. ప్రభుత్వ పాఠశాలల్లో ఒంటిపూట బడులు నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కడవల రవికుమార్, ఏఐఎస్ఎఫ్ నాయకులు శ్రీకాంత్ కోరారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభమవుతాయన్నారు. ఈ ఏడాది అప్పుడే ఎండలు మండి పోతున్నాయని, విద్యార్థులు సాయంత్రం వరకు ఉండాలంటే వడదెబ్బ బారిన పడే అవకాశాలున్నాయని పేర్కొన్నారు.

కోసిగి మీదుగా వందేభారత్ రైలు

కోసిగి, మార్చి 12: ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం వర్చువల్ విధానం ద్వారా వందేభారత్ రైలును ప్రారంభించారు. మంత్రాలయం స్టేషన్ స్టాఫ్‌లో భాగంగా కల్బుర్గీ బెంగుళూరు వందేభారత్ రైలు రాయచూరు, మంత్రాలయం రోడ్డు, గుంతకల్లు, అనంతపురం స్టేషన్‌ల మీదుగా ప్రయాణిస్తుందని రైల్వే అధికారులు తెలిపారు. కోసిగి రైల్వేస్టేషన్ మీదుగా మంగళవారం మధ్యాహ్నం వందేభారత్ రైలు వెళ్లడంతో కోసిగి ప్రజలు మంత్రాలయం రైల్వేస్టేషన్‌లో స్టాపింగ్ ఉండటంతో హర్షం వ్యక్తం చేశారు.


కోసిగి రైల్వేస్టేషన్ మీదుగా వెళ్తున్న వందేభారత్ రైలు

నేను లోకల్

ఇక్కడే పుట్టా.. ఇక్కడే పెరిగా.. ఇక్కడే చదివా.. ఇక్కడే ఉంటా

మీ బిడ్డగా అడుగుతున్నా.. ఒక్క అవకాశం ఇవ్వండి

అస్తవ్యస్తమైన రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి అవస్థలు, ఉపాధి లేని యువతరం

భరోసా యాత్రలో సమస్యలను కళ్లారా చూశా

పరిశ్రమలు.. హైకోర్టు బెంచి ఏర్పాటే పరిష్కారం

ఎమ్మెల్యేగా అసెంబ్లీకి పంపిండి.. ఎదిగే కర్నూలును బహుమతిగా ఇస్తా

డాక్టర్ ఇస్మాయిల్.. టీజీ వెంకటేశ్‌ల మధ్య రాం.. రహీం అనేంత అనుబంధం

● చంద్రబాబు విజన్.. మోదీ ఇమేజ్.. పవన్ కమిట్‌మెంట్ ఈ రాష్ట్రానికి అవసరం

ఆంధ్రజ్యోతి ప్రత్యేక ఇంటర్వ్యూలో కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్





టీజీ కుటుంబం గురించి కర్నూలు ప్రజానీకానికి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. పారిశ్రామిక, వ్యాపార రంగాలు ద్వారా వేలాది మంది యువతకు ఉపాధి, ఉద్యోగాలు కల్పించారు. పలు సామాజిక, సేవా కార్యక్రమాల్లో సరిలేరు మాకెవ్వరు..! అని చాటారు. ఏటేటా పేద జంటలకుఉచిత పెళ్లిళ్లు జరిపించి వారికి అమ్మానాన్నలు అయ్యారు. రాజకీయాల్లో అడుగుల పెట్టినా ప్రజా సేవకే అంకితమయ్యారు. ఆ కుటుంబానికి చెందిన యువనేత టీజీ భరత్ రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా బరిలో దిగనున్నారు. ఈ నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఇందులో..నేను లోకల్..! ఈ గడ్డపైనే పుట్టా.. ఇక్కడే పెరిగా.. ఇక్కడే చదివా..! వీధివీధి నాదే అంటూ టీజీ భరత్ భరోసా యాత్ర, బాబు షూరిటీ.. భవిషత్తుకు గ్యారెంటీ కార్యకమాల ద్వారా ఇంటింటికి వెళ్లాను. జనం పడుతున్న ఇబ్బందులు, సమస్యలు కళ్లారా చూశాను. అంధకార పాలన నుంచి కర్నూలు నగరం అభివృద్ధి.. సంక్షేమ పట్టాలపై పరుగులు తీయాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి డబుల్ ఇంజన్ ప్రభుత్వం పట్టాలెక్కాలి. ముస్లింలను కాపాడుకునే బాధ్యత నాదే.. విఫలమైతే నా ఎమ్మెల్యే పదవికి కూడా రాజీనామా చేసేందుకు వెనకాడను. నగరంలో టీజీ వెంకటేశ్, డాక్టర్ ఇస్మాయిల్‌ల మధ్య రాం.. రహీం అనేంత అనుబంధం ఉండేది. డాక్టర్ ఇస్మాయిల్ బతికే ఉంటే టీజీ భరత్‌కే ఓటు వేయమని తప్పక చెప్పేవారు.. అన్నారు. విశేషాల్లోకి వెళ్తే..







కర్నూలు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి)

● **ఆంధ్రజ్యోతి ప్రతినిధి : టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన తొలి జాబితాలో కర్నూలు నియోజకవర్గం టీడీపీ అభ్యర్థిగా మీ పేరు ప్రకటించారు. ఎలా ఫీల్ అవుతున్నారు..?**

● **టీజీ భరత్ :** 2019 ఎన్నికల్లో చివరి వరకు అభ్యర్థిగా ప్రకటించలేదు. ఆ రోజు బాగా టెన్షన్‌గా ఉండేది. రాబోయే 2024 ఎన్నికల్లో కర్నూలు అభ్యర్థి టీజీ భరతే అని ఏడాది క్రితమే చంద్రబాబు స్పష్టమైన హామీ ఇచ్చారు. గత ఏడాది ఆగస్టులో అనుకుంటూ పార్టీ నాయకులు, కార్యకర్తల ముందే స్పష్టత ఇచ్చారు. ఆ ధీమాతోనే ఏడాదిన్నర నుంచే నేను ఏర్పాట్లలో నిమగ్నమైయ్యాను. తొలి జాబితాలో ప్రకటించడం ఆనందంగా ఉంది. అధినేత చంద్రబాబు, యువనేత లోకేశ్‌కు థ్యాంక్స్ చెబుతున్నాను.

● **ఎన్నికల షెడ్యూలు రాకముందే హడావుడి మొదలైంది. ఎన్నికల ఏర్పాట్లలో నిమగ్నమైయ్యారు. ఎలా సాగుతున్నాయి..?**

● **టీజీ :** ముందే చెప్పాను కదా..! ఏడాదిన్నరగా మా ఏర్పాట్లలో మేము ఉన్నాం. బూత్ స్థాయి నుంచి ఇన్‌చార్జిలను బలోపేతం చేస్తున్నాం. ఎన్నికలు ఎప్పుడు జరిగినా క్లీన్ స్వీప్ విజయం అందుకుంటానే ధీమా ఉంది. టీజీ భరత్ భరోసా యాత్ర, బాబు షూరిటీ.. భవిషత్తుకు గ్యారెంటీ కార్యక్రమాలు ద్వారా వార్డుల పర్యటనలు చేస్తూ ఇంటింటికి వెళ్తున్నాం. ప్రజలు ఓ కుటుంబ సభ్యుడిగా ఆదరిస్తున్నారు.

● **కర్నూలు నియోజకవర్గంలో దొంగ ఓట్లు, బోగస్ ఓట్లు ఎక్కువగా ఉన్నాయి. వాటిని అరికట్టేందుకు మీరు తీసుకున్న చర్యలు వివరిస్తారా..?**

● **టీజీ :** ఈ స్థాయిలో దొంగ ఓట్లు, బోగస్ ఓట్లు ఉన్నాయని నేను ఊహించలేదు. జాబితా పరిశీలిస్తే కుప్పలు తెప్పలుగా డబుల్ ఎంట్రీ బోగస్ ఓట్లు ఉన్నాయి. వీటిని చూస్తే.. 2019 ఎన్నికల్లో వీటివల్లే ఓటమి చెందానా..? అనిపిస్తుంది. డబుల్ ఎంట్రీలు, బోగస్ ఓట్లు ఎక్కడెక్కడ ఉన్నాయో గుర్తించి జిల్లా ఎన్నికల అధికారి అయిన కలెక్టరుకు ఫిర్యాదు చేశాం. మా అంచనా ప్రకారమే 6-7 వేలకు పైగా ఉన్నట్లు తెలుస్తుంది. జిల్లా ఎన్నికల అధికారులు సమగ్రంగా విచారించి బోగస్ ఓట్లు తొలగించాల్సిన అవసరం ఉంది. అవసరమైతే కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తాం.. న్యాయ పోరాటం కూడా చేస్తాం.

● **వలంటీర్లను ఉపయోగించుకొని వైసీపీ గెలవాలని చూస్తుంది. ఎలా కట్టడి చేస్తారు..? అందుకు మీ ముందున్న వ్యూహాలేంటీ..?**

● **టీజీ :** ఎన్నికల్లో వలంటీర్లను ఉపయోగించరాదని ఎన్నికల సంఘం చాలా స్పష్టంగా చెప్పింది. వైసీపీ నాయకులు అధికారం అడ్డం పెట్టుకొని వలంటీర్లను ఎన్నికల్లో ఉపయోగించుకోవాలని చూస్తే సీఈసీకి ఫిర్యాదు చేస్తాం. వారిని ధీటుగా ఎదుర్కోవడానికి ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో ఇద్దరు, ముగ్గురు బూత్ స్థాయి ఇన్‌చార్జిలను నియమించాం.. ఇంటింటికి వెళ్లి టీడీపీ ప్రభుత్వం వచ్చాక చేపట్టే సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలు వివరిస్తున్నారు. పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాం. అక్రమాలు ద్వారా ఎన్నికల్లో గెలవాలనుకునే వైసీపీ ఆటలు సాగనివ్వం.

● **ఎన్నికల షెడ్యూల్ రాక ముందే ప్రచారం జోరు పెంచారు. ప్రజల నుంచి ఎలాంటి స్పందన వస్తోంది..?**

● **టీజీ :** వార్డు పర్యటనలో భాగంగా ఇంటింటికి వెళ్తుంటే.. ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తున్నది. కుటుంబ సభ్యుడిలా ఆదరిస్తున్నారు. అన్నా..! రండి.. అంటూ ఆప్యాయంగా ఆహ్వానిస్తున్నారు. ముస్లిం మైనార్టీ వార్డుల్లో ఇంతటి స్పందన ఎన్నడు చూడలేదు. నిరుద్యోగ యువత, ఉద్యోగులు, మహిళలు ఈ సైకో ప్రభుత్వాన్ని ఇంటికి పంపేందుకు కసిగా ఎదురు చూస్తున్నారు. ఎక్కడికి వెళ్లినా అన్నా..! మా ఓటు మీకే అంటూ హారతులు పడుతున్నారు.

● **వైసీపీ ఐదేళ్ల పాలనలో పైపై మెరుగులు తప్ప..శాశ్వత అభివృద్ధి లేదు.. మీరు ఎమ్మెల్యేగా గెలిచాక నగర అభివృద్ధి ఎలాటి ప్రణాళిక అమలు చేస్తారు?**

● **టీజీ :** పారిశ్రామిక ప్రగతి అన్నింటికీ పరిష్కారం. పరిశ్రమలు తీసుకొస్తే యువతరానికి ఉపాధి, ఉద్యోగాలు వస్తాయి. వారిలో కొనుగోలు శక్తి పెరుగుతుంది. తద్వారా కుల మతాలకు అతీతంగా నగరం రూపురేఖలు మారిపోతాయి. గత టీడీపీ ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు అనంతపురం జిల్లాకు కియా పరిశ్రమ తీసుకొచ్చారు. నేడు ఆ జిల్లా రూపురేఖలు మారిపోతున్నాయి. ఆ స్ఫూర్తితో కర్నూలుకు పరిశ్రమలు తీసుకొస్తాను. యువగళం పాదయాత్ర సమయంలో ఇక్కడ ఫార్మా హబ్ ఏర్పాటుకు యువనేత లోకేశ్ స్పష్టమైన హామీ ఇచ్చారు. పత్తికొండ రా కదిలిరా సభలో కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని చంద్రబాబు చెప్పారు. పరిశ్రమలు, హైకోర్టు బెంచ్ ఏర్పాటు ద్వారా అభివృద్ధికి అడుగులు పడుతాయి.

● **ప్రజల నుంచి ఎలాంటి సమస్యలు మీ దృష్టికి వచ్చాయి..?**

● **టీజీ :** ఓల్డ్ టౌన్‌లో అస్తవ్యస్తంగా మారిన విద్యుత్ తీగల వల్ల షార్ట్ సర్క్యూట్ ప్రమాదాలు పొంచి ఉన్నాయి. మురుగు కాల్వలు, రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. పైపై మెరుగులు తప్ప పేదలు ఉండే కాలనీల్లో అభివృద్ధి కనిపించడం లేదు. బిందెడు తాగునీటి కోసం అర్ధరాత్రి జనం జాగరణ చేయాల్సిన దుస్థితి కనిపిస్తున్నది. ఇంటి స్థలం పట్టాలు, పక్కా ఇళ్లు ఇవ్వలేదని మెజార్టీ ప్రజలు నా దృష్టికి తెచ్చారు. టీడీపీ ప్రభుత్వం కట్టించిన 10 వేల టిడ్కో ఇళ్లు కూడా పంపిణీ చేయలేదని ప్రజలు ఎంతో బాధ పడ్డారు. డిగ్రీలు, పీజీలు చేసిన నిరుద్యోగ యువత ఉపాధి, ఉద్యోగాలు లేవు అంటూ ఏకరువు పెట్టారు. చెత్త పన్ను, ఆస్తి పన్ను విచ్చలవిడిగా పెంచారు.. 2019తో పోలిస్తే నిత్యావసర సరుకుల ధరలు రెట్టింపు అయ్యాయి. ఆ స్థాయిలో ఆదాయం పెరగలేదు.. ఖర్చులు మాత్రం మూడింతలు పెరిగాయని ప్రజలు నా దృష్టికి తెచ్చారు.



గతేడాది కర్నూలు నగరంలో నిర్వహించిన యువగళం పాదయాత్రకు వేలాదిగా తరలివచ్చిన నగరవాసులు

● **వీటి పరిష్కారానికి ఎలాంటి ప్రణాళికలు ఉన్నాయి..?**

● **టీజీ :** రియల్ స్మార్ట్ సిటీ, నేను ప్రకటించిన ఆరు గ్యారెంటీలు, రాబోయే చంద్రబాబు ప్రభుత్వం అమలు చేయనున్న సూపర్ సిక్స్ పథకాలు అమలు మెజార్టీ సమస్యలు పరిష్కారం లభిస్తుంది. పక్కా ప్రణాళిక ద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిధులు తెప్పించి ప్రగతి పథంలో ముందుకు తీసుకెళ్తా. తాగునీటి సమస్య పరిష్కారానికి గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి పైపులైన్, తుంగభద్ర నదిపై చెక్ డ్యాం నిర్మించడం.. ఏదీ ప్రయోజకరంగా ఉంటుందో నిపుణులతో అధ్యయనం చేయిస్తా. నిపుణుల కమిటీ సూచన మేరకు ముందుకు వెళ్తాను.



● **మీకు ప్రత్యర్థిగా వైసీపీ ఐపీఎస్ అధికారి ఏఎండీ ఇంతియాజ్ అహ్మద్‌ను బరిలో దింపనుంది. ఆయనను ఎదుర్కోవడానికి ఎలాంటి రాజకీయ అస్త్రాలు సంధిస్తారు..?**

● **టీజీ :** నేను లోకల్..! ఈ గడ్డపైనే పుట్టాను.. ఇక్కడే పెరిగా.. చదివా.. ఇక్కడే ఉంటాను. కర్నూలు నగరంలో వీధివీధి నాకు పరిచయం ఉంది. ఎక్కడ ఎలాంటి సమస్యలు ఉన్నాయో.. వాటిని ఎలా పరిష్కరించాలో కూడా తెలుసు. కుల మతాలకు అతీతంగా ప్రజలతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. టీజీ కుటుంబం గురించి తెలియని వారే లేరు. వైసీపీ ఎంపిక చేసిన అభ్యర్థి ఇంతియాజ్ అహ్మద్ నాన్ లోకల్. కర్నూలు నగరంతో ఎలాంటి సంబంధాలు లేవు. అంతెందుకు ఆయన మామ అయిన డాక్టర్ ఇస్మాయిల్‌కు, మా నాన్న టీజీ వెంకటేశ్ మధ్య రాం.. రహీం అనేంత అనుబంధం ఉంది. డాక్టర్ ఇస్మాయిల్ ఈ రోజు మన మధ్య లేకపోవడం బాధగా ఉంది. ఆయనే బతికి ఉంటే తప్పకుండా టీజీ భరత్‌కే ఓటు వేయమని చెప్పేవారు. ఆ కుటుంబంతో అంతటి అనుబంధం మాకుంది.

● **టీడీపీ ప్రభుత్వం వచ్చిన ఏడాదిలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని స్పష్టం చెబుతున్నారు. మీ అధినేత చంద్రబాబుతో చర్చించారా..?**

● **టీజీ :** పత్తికొండకు రా కదలిరా సభలోనే కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని మా అధినేత చంద్రబాబు స్పష్టమైన హామీ ఇచ్చారు. నేను కలిసిన పలు సందర్భాల్లోనూ చెప్పారు. మా ప్రభుత్వం వచ్చిన ఆరు నెలలు, ఏడాదిలోగా ఏర్పాటు చేస్తాం.



● **నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటారు..?**

● **టీజీ :** బళ్లారి చౌరస్తా, రాజ్‌విహార్ సెంటర్, ఓల్డ్ బస్టాండ్, ఐదు రోడ్ల జంక్షన్, సీ క్యాంప్, కలెక్టరేట్.. ఇలా పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు ప్రధానంగా ఉన్నాయి. మా ప్రభుత్వం రాగానే పట్టణ ప్రణాళిక నిపుణులతో స్టడీ చేయించి నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. అవసరమైన చోట ఫ్లైఓవర్ బ్రిడ్జీలు కూడా కట్టేందుకు పక్కా ప్రణాళికలు తయారు చేస్తాం.

● **దానాలు చేయడంలో టీజీ కుటుంబం చేతికి ఎముక లేదంటారు.. దీనికి మీ సమాధానం..?**

● **టీజీ :** రాజకీయాల్లో రాకమునుపే మా కుటుంబం సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుంది. ఎన్నికలు వేరు.. సేవా కార్యక్రమాలు వేరు. ఈ రెండింటికి ఎప్పుడు ముడిపెట్టే కుటుంబం కాదు మాది. పదవులు వస్తుంటాయి.. పోతుంటాయి. ప్రజాభిమానమే ముఖ్యం. అందుకే ఫలాన సాయం కావాలని మా ఇంటి తలుపు తట్టిన వారికి లేదు అనకుండా సాయం చేయడం మా నాన్న టీజీ వెంకటేశ్ నేర్పించారు. సేవా కార్యక్రమాలు నిరంతర ప్రక్రియ.

● **రాజకీయాల్లో రావాలనే స్ఫూర్తితో ఎవరు...? ఎందుకు రావాలనుకున్నారు?**

● **టీజీ :** నాకు రోల్ మోడల్, స్ఫూర్తి మా నాన్న టీజీ వెంకటేశ్ గారు. ప్రజలకు సేవ చేయాలని, ప్రజలు బాగుండాలని ఆయన నిత్యం పరితపిస్తున్న తీరు చూసి నేనెందుకు రాజకీయాల్లోకి రాకూడదని అనుకున్నాను. నాన్న ఆశీస్సులతో అడుగు పెట్టాను. రాజకీయాల్లో తండ్రిని మించిన తనయుడు అనిపించుకోవాలిన లక్ష్యం. నా భుజం తట్టి శభాష్ భరత్.. అని నాన్న అంటే అదే నాకు గొప్ప వరం.

● **టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తుపై మీ అభిప్రాయం?**

● **టీజీ:** ఇది విన్నింగ్ టీం. చంద్రబాబు విజన్, మోదీ ఇమేజ్, పవన్ కమిట్‌మెంట్ ఈ దేశం, రాష్ట్రానికి ఎంతో అవసరం. స్థానికంగా జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్తాం.



మాట్లాడుతున్న టీజీ భరత్



● **వైసీపీ ప్రభుత్వం ఉర్దూ యూనివర్సిటీ భవనాల నిర్మాణాలు ఆపేశారు..? దీనికి మీరేమంటారు..?**

● **టీజీ :** వైసీపీకి విధ్వంసం తప్ప అభివృద్ధి చేయడం తెలియదు. కర్నూలు నగరం సహా ఉమ్మడి జిల్లాలో ముస్లిం మైనార్టీలు ఎక్కువగా ఉన్నారు. వారు ఉర్దూ ఉన్నత విద్య కోసం హైదరాబాదుకు వెళ్లకుండా ఇక్కడే చదువుకునేలా టీడీపీ ప్రభుత్వంలో నాటి సీఎం చంద్రబాబు డాక్టరు అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేశారు. 120 ఎకరాల్లో ఓర్వకల్లు వద్ద విమానాశ్రయం సమీపంలో నూతన భవనాలు నిర్మాణం చేపట్టారు. జగన్ ప్రభుత్వం వచ్చాక ఆ పనులు ఆపేశారు. ఇది మైనార్టీలపై వైసీపీకి ఉన్న చిత్తశుద్ధి. టీడీపీ ప్రభుత్వం రాగానే చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పనులు పునఃప్రారంభించేలా చర్యలు తీసుకుంటాను.



● **మీ బాల్యం.. కుటుంబం.. రాజకీయ నేపథ్యం వివరిస్తారా..?**

● **టీజీ:** నేను 10వ తరగతి వరకు మాంటిస్సోరి హైస్కూల్, ఇంటర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీ, బీకాం డిగ్రీ ఉస్మానియా కాలేజీలో చేశాను. ఇంటర్న్‌షిప్ చెన్నైలో చేశా. యూకేలో ఎంబీఏ చదివాను. నా భార్య టీజీ శిల్పాభరత్ బీకాం, ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం పూర్తి చేసింది. మాకు ఇద్దరు పిల్లలు. కూతూరు శ్రీఆర్య, కుమారుడు టీజీ విభు. మా కుటుంబంలో 1967లోనే ఆదోని ఎమ్మెల్యేగా టీజీ తిమ్మయ్య శెట్టి ఎన్నిక అయ్యారు. మా నాన్న టీజీ వెంకటేశ్ 1999, 2009లో రెండుసార్లు కర్నూలు ఎమ్మెల్యేగా గెలిచారు. ఉమ్మడి రాష్ట్రంలో కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వంలో చిన్ననీటి పారుదల శాఖ మంత్రిగా పని చేశారు. నాన్న స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చాను. మా అమ్మ టీజీ రాజ్యలక్ష్మి, సతీమణి టీజీ శిల్పాభరత్ సంపూర్ణ సహకారంతోనే ఎన్నికల ప్రచారంలో చురుగ్గా పాల్గొంటున్నాను.



● **యువ నేత లోకేశ్ పాదయాత్ర సందర్భంగా ఎలాంటి సమస్యలు మీ దృష్టికి వచ్చాయి..? వాటి పరిష్కారానికి ఎలాంటి ప్రణాళికలు సిద్ధం చేశారు..?**

● **టీజీ :** మెజార్టీగా తాగునీరు, రోడ్లు, డ్రైనేజీలు, ఇంటి స్థలం పట్టాలు, పక్కా ఇళ్లు.. ఇలాంటి సమస్యలు వచ్చాయి. వీటి పరిష్కారానికే ఆరు గ్యారెంటీలు అమలు చేసే బాధ్యతతో జనం ముందుకు వస్తున్నాను. 1999లో టీడీపీ వచ్చింది.. ఆ తర్వాత టీడీపీ ఇక్కడ గెలవలేదు. ఇప్పుడు గెలిపిస్తే నగరం ఏ స్థాయిలో అభివృద్ధి చెందుతుందో చేసి చూపిస్తాను. ప్రగతి కోసం పాటు పడుతాను.



కర్నూలులో నారాలోకేశ్ పాదయాత్రలో టీజీ భరత్

ముస్లింలను కాపాడుకునే బాధ్యత నాది : టీజీ భరత్

బీజేపీతో పొత్తు ఉందని ముస్లింలు ఆందోళన చెందనవసరం లేదు. వారిని కాపాడునే బాధ్యత నాది. ఏ బిల్లులు అమలైనా ముస్లింలకు అండగా ఉంటాను. ఒక్క ముస్లిం కుటుంబానికి అన్యాయం జరిగినా అవసరం అయితే నా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడానికి కూడా వెనకాడను. పూర్తిగా రక్షణగా నిలుస్తాను. బీజేపీ పొత్తు వల్ల ముస్లిం మైనార్టీలకు అన్యాయం జరుగుతుందని కొందరు రాజకీయ స్వార్థంతో ప్రచారం చేస్తున్నారు. అలాంటి వారి మాటలు నమ్మవద్దు. ఎన్‌ఆర్‌సీ, సీసీఏ బిల్లు ఏదైనా కర్నూలు నగరంలో ఒక్క ముస్లింకు కూడా అన్యాయం జరగకుండా చేసుకునే బాధ్యత నాది. టీజీ కుటుంబం ఎలాంటిదో నగరంలో అందరికి తెలుసు. కుల మతాలకు అతీతంగా అందరి సంక్షేమం, ప్రగతి రెండు పట్టాలపై నడిపించేందుకు మొదటి నుంచి కృషి చేస్తున్న కుటుంబం మాది. 2014లో కూడా బీజేపీతో పొత్తు ఉంది. ఏ ఒక్క ముస్లింకు కూడా అన్యాయం జరగనివ్వలేదు. మా కుటుంబం అన్ని కులాలను మతాలను సమానంగా చూస్తుంది. అందుకే మా సంస్థల్లో ముస్లింలు దశాబ్దాలుగా పని చేస్తున్నారు. ఎన్నికల్లో లబ్ధి కోసం స్వార్థపరులు ఇష్టమొచ్చినట్లుగా ప్రచారం చేస్తున్నారు. వారి మాటలు నమ్మవద్దని సూచిస్తున్నాను. మేం ముస్లింలకు కీడు చేశామని చెప్పడానికి ఒక్క ఉదాహరణ చూపించలేరు.